

నమ్మలేని నిజాలు

మిర్చీ మసాల
అబద్ధాల నీడలు
నేటి వార్తలు.

పాట ఆగింది
రాలిన కోయిలలు
బాధలో దేశం.

భ్రూణ హత్యలు
నాశరీరం నా ఇష్టం
సమాజ నేరం.

చైనా పై కన్ను
చతుర్భుజ కూటమి
సాగర వ్యూహం.

ప్రకటనలు
రొక్కం నీరైపారింది
ఆనంద కేళి

– రేడియమ్
సెల్: 9291527757

# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com



ఏపార్టీ చూస్తేనేం
బాకు కొరకు పాకులాట !
రంకు బొంకు రాజకీయ
మేకులతో పీకులాట !

మానసిక ఆయాసమే
పడుకుంటునే అలవాటు !
దేశానికి అవసరమే
ప్రత్యామ్నాయ ఏర్పాటు !

శ్రీనిజాలు

– కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245

హైదరాబాద్ | గురువారం 16-6-2022 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :28 | సంచిక: 254 | పేజీలు:6 | వెల: రూ.1/-


## కేసీఆర్ వచ్చాక మార్కెట్ వ్యవస్థ బలోపేతం : హరీశ్ రావు

సిద్దిపేట జిల్లా, జూన్ 15: మార్కెట్ వ్యవస్థ కేసీఆర్ వచ్చాక చాలా బలోపేతమైందని రాష్ట్ర మంత్రి హరీశ్ రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని మార్కెట్ యార్డ్ లో నూతన సిద్ధిపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారోత్సవంలో మంత్రి హరీశ్ రావు పాల్గొన్నారు. ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి, జెడ్పీ చైర్మన్ రోజా శర్మ, ఎమ్మెల్సీలు పారుక్ హుస్సేన్, యాదవ్ రెడ్డి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి హరీశ్ రావు మాట్లాడుతూ? మార్కెటింగ్ వ్యవస్థలో రిజర్వేషన్స్ తెచ్చిన ఘనత సీఎం కేసీఆర్ దేనన్నారు. మహిళలు అన్ని రంగాల్లో అద్భుతంగా రాణిస్తున్నారని, కావున ఈ మార్కెట్ కమిటీ మహిళకు కేటాయించారన్నారు. సిద్దిపేటలో 1లక్ష 20వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిందన్నారు. గత ప్రభుత్వాలు గోడౌన్ల కోసం ఆలోచించిన దాఖలాలు లేవన్నారు. ప్రతి మండలంలో 5వేల మెట్రిక్ టన్నుల గోడౌన్ లు నిర్మించామన్నారు. దేశానికి అన్నం పెట్టే ధాన్య గారంగా తెలంగాణ మారిందన్నారు. ఆంధ్ర కంటే రెట్టింపు వరి పంట తెలంగాణలో పండిందన్నారు. పంట పండడం వల్ల ధాన్యం మోయడానికి కూలీలు దొరకని పరిస్థితి తెలంగాణ వచ్చిందని, ఇతర రాష్ట్రాల నుండి కూలీలు వస్తున్నారన్నారు.

## నెలాఖరులో జీఆర్ఎంబీ సమావేశం..

హైదరాబాద్, జూన్ 15: ఈ నెలాఖరులో గోదావరి నదీ యాజమాన్య బోర్డు (జీఆర్ఎంబీ) సమావేశం జరగనుంది. గోదావరి నదిలో కేవలం 493. 5 టీఎంసీలనే ఏపీ వినియోగించుకునేలా కట్టడి చేయాలని తెలంగాణ కేంద్ర జలశక్తి శాఖను కోరిన నేపథ్యంలో త్వరలో జరగనున్న జీఆర్ఎంబీ సమావేశానికి ప్రాధా న్యత ఏర్పడింది. పోలవరం ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువల నుంచి రోజు 1.7టీఎంసీల చొప్పున మొత్తం 449.78 టీఎంసీలను మాత్రమే తీసుకునేందుకు సీడబ్ల్యూసీ అనుమతించిందని కొద్ది రోజుల క్రితం కేంద్ర జలశక్తిశాఖకు తెలంగాణ నీటిపారు దల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజత్ కుమార్ లేఖరాసిన విషయం తెలిసిందే. అయితేఏపీ అక్రమంగా రోజుకు ఆ టీఎంసీల నీటిని తరలించేందుకు కాలువల విస్తరణ పనులు చేపడుతుండడంపై జీఆర్ఎంబీ ఎదుట తెలంగాణ అభ్యంతరాల ను వ్యక్తం చేయనుంది.

నికర జలాల కేటాయింపులు లేకుండానే గోదావరిపై అక్రమ ప్రాజెక్టులు నిర్మిస్తున్న ఏపీ? అదే సమయంలో ఉమ్మడి రాష్ట్రంలో నికర జలాల ఆధారంగా తలపెట్టిన తెలంగాణ ప్రాజెక్టులకు నీటి కేటాయింపులు లేవంటూ పదే పదే ఫిర్యాదు చేయడాన్ని బోర్డు ఎదుట గట్టిగా ఏపీని నిలదీయాలని తెలంగాణ నిర్ణయించింది. ఈ మేరకు అవసరమైన కసరత్తును తెలంగాణ సాగునీటిపారుదల శాఖలోని గోదావరి నదీ విభాగం అధికారులు పూర్తి చేశారు. అదేవిధంగా తెలంగా ణలోని మోడికుంటవాగు, కడెం ప్రాజెక్టుల నిర్వహణపై తెలంగాణ నీటిపారుదల శాఖ అధికారులతో బోర్డు చర్చించనుంది. అదే సమయంలో గోదావరిపై నిర్మిస్తు న్న ఎత్తిపోతల ప్రాజెక్టులకు సంబంధించిన డీపీఆర్ల ఆమోదం పెండింగ్లో ఉన్న విషయాన్ని బోర్డు దృష్టికి తీసుకెళతామని తెలంగాణ ఇరిగేషన్శాఖ ఉన్నతాధికారులు చెబుతున్నారు.

## పాలమూరును అభివృద్ధికి చిరునామాగా మారుద్దాం : మంత్రి శ్రీనివాస్ గౌడ్

మహబూబ్ నగర్, జూన్ 15: అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్గా మహబూబ్నగర్ను చేసుకుందామని మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రం మార్కెట్ యార్డులోని గుమస్తాలు, హమాలీలు మంత్రి శ్రీనివాస్ గౌడ్ సమక్షంలో టీఆర్ఎస్లో చేరారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. జిల్లాను అన్ని విధాలుగా అభివృద్ధి చేసుకుంటున్నామన్నారు.

ఎవరికి ఏ కష్టం వచ్చినా ఆదుకుంటామని మంత్రి భరోసానిచ్చారు. మంచి చేసే వారి వెంబడి ఉంటే మంచి జరుగుతుందని పేర్కొన్నారు. కాంగ్రెస్ 70 ఏండ్లు పాలించి కనీసం తగడానికి మంచి నీళ్లు కూడా ఇవ్వలేదని విమర్శించారు. టీఆర్ఎస్ పాలనలో సాగు, తాగు నీరుకు డోకాలేదన్నారు. కొన్ని పార్టీలు కుల, మత పిచ్చిలో జనం ఉండాలని కోరుకుంటున్నారు.

అలాంటి వారిపట్ల అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. కాగా, అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులయ్యే టీఆర్ఎస్ చేరుతున్నామని హమీలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కేసీ నర్సింహులు, వైస్ చైర్మన్ తాటి గణేష్, ముడ చైర్మన్ గంజి

తెలంగాణ పల్లెలు దేశానికే ఆదర్శం..

# అత్యుత్తమ 20 గ్రామాల్లో 19 తెలంగాణవే : కేటీఆర్



రాజన్న సిరిసిల్ల, జూన్ 15: (నేటినిజం ప్రతినిధి):తెలంగాణ మంత్రి, టీఆర్ ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇవ్వాల (బుధవారం) సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం వెంకట్రావుపల్లెలో జరిగిన పల్లె ప్రగతి కార్యక్రమంలో పాల్గొన్నారు. వెంకట్రావుపల్లెలో రూ.16 లక్షలతో నిర్మించిన గ్రామ పంచాయితీ భవనాన్ని ప్రారంభించారు. రూ.33 లక్షలతో నిర్మించిన కేసీఆర్ ప్రగతి ప్రాంగణాన్ని ప్రారంభించారు.

వెంకట్రావుపల్లె ప్రాథమిక పాఠశాలను 7వ తరగతి వరకు అప్ గ్రేడ్ చేస్తామని చెప్పారు.

ముస్తాబాద్ మండలం భీకోడు గ్రామంలో సీసీ కెమెరాలు, డిజిటల్ క్లాస్ రూమ్ లను మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. గ్రామంలో కొత్తగా కళ్యాణ మంటపం నిర్మిస్తామని అన్నారు. భీకోడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చదువుకునేందుకు 3 కిలోమీటర్ల దూరంలోని పర్శారాములు నగర్ నుంచి కాలినడకన వస్తున్న 25 మంది విద్యార్థులకు 25 సైకిళ్లు సాయంత్రం వరకు అందజేస్తామని హామీ ఇచ్చారు.

మనందరి బాగుకోసమే సీఎం కేసీఆర్ పల్లె ప్రగతి కార్యక్రమాన్ని చేపట్టారు. కొత్త పెన్షన్లు, రేషన్ కార్డుల మంజూరుకు సీఎం కేసీఆర్ ఆమోదం తెలిపారు. త్వరలోనే అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ కొత్త పెన్షన్లు, రేషన్ కార్డులు మంజూరు చేస్తాం.

ప్రతి గ్రామపంచాయతీలో తాగునీటి సౌకర్యంతోపాటు ట్రాక్టర్, ట్రాలీ, వైకుంఠ ధామం, నర్సరీలు, పల్లె ప్రకృతి వనం, రోడ్లు, డ్రైనేజీలు సహా అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తాం. వెంకట్రావుపల్లెలో విరాసత్ సహా అన్ని భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతాం. గ్రామానికి సాగునీటి సౌకర్యం కల్పిస్తాం, సొంత జాగాలో ఇండ్ల నిర్మాణం చేసుకునే వారికి ఆర్థిక సహాయం అందిస్తాం అని మంత్రి కేటీఆర్ అన్నారు.

### ఉపాధి కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నాం

ఉపాధి కల్పనలో దేశంలో తెలంగాణ ముందుందని మంత్రి కేటీఆర్ చెప్పారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాలతోపాటు ఉపాధి కల్పనకు ప్రాధాన్యమిస్తున్నామని వెల్లడించారు. నలుగురికి ఉపాధి కల్పించేందుకు ముందుకు వచ్చేవారిని ప్రోత్సహిస్తామన్నారు.

నీళ్లు, నిధులు, నియామకాల కోసమే తెలంగాణ సాధించుకున్నామని చెప్పారు. దేశంలో 65 శాతం జనాభా 35 ఏండ్ల లోపువారేనని తెలిపారు. 80 వేల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి ప్రక్రియ ప్రారంభమైందని తెలిపారు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేవారికి అన్నివిధాల అండగా ఉంటామని చెప్పారు.

ఇంటింటికి తాగు నీరు ఇస్తున్నామని, ఎండా కాలంలోను చెరువులు నిండు కుండను తలపిస్తున్నాయన్నారు. ముస్తాబాద్ ప్రభుత్వ జూనియర్ కాలేజీలో నిర్వహించిన కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు.

### సీఎం కేసిఆర్ నాయకత్వంలో జోడెడ్ల మాదిరి అభివృద్ధి, సంక్షేమం పరుగులు

సీఎం కేసిఆర్ నాయకత్వంలో జోడెడ్ల మాదిరి అభివృద్ధి, సంక్షేమం పరుగులు తీస్తోందని మంత్రి కేటీఆర్ అన్నారు.

భీకొడు రైతు వేదికలో ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. దేశంలోనే అత్యుత్తమ 20 గ్రామాల్లో 19 తెలంగాణవే నని అన్నారు. రైతులకు 24 గంటల పాటు ఉచిత కరెంట్ ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని చెప్పారు. 75 ఎండ్లలో దేశంలోనీ ప్రతి ఇంటికి తాగునీరు ఇవ్వాలన్న స్పృహ గత ప్రభుత్వాలకు రాలేదనీ అన్నారు.

మిషన్ భగీరథ ద్వారా ప్రతి ఇంటికీ నల్లా ద్వారా సురక్షిత తాగునీరు అందిస్తున్నామని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ తో సాగునీటి రంగంలో అద్భుతాలు సృష్టించానీ అని చెప్పారు

. పెన్షన్ ల క్రింద ఏటా తెలంగాణలో 10 వేల కోట్లు ఖర్చు చేస్తున్నానీ.. తెలంగాణలో 2, 600 రైతు వేదికలను 6 నెలల్లో నిర్మించానీ.. రైతు బంధు కింద 50 వేల కోట్ల రూపాయలను పెట్టుబడి సహాయంగా అందజేశామని మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు.

కార్యక్రమంలో జిల్లా ప్రజా పరిషత్ చైర్ పర్సన్ అరుణ రెడ్డి, కలెక్టర్ అనురాగ్ జయంతి, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## ప్రణాళికాబద్ధంగా చదవండి.. ప్రభుత్వ ఉద్యోగం సాధించండి : మంత్రి కేటీఆర్



రాజన్న సిరిసిల్ల, జూన్ 15: (నేటినిజం ప్రతినిధి):ఈ మూడు నెలల పాటు ప్రణాళికబద్ధంగా కష్టపడి చదివి.. ప్రభుత్వ ఉద్యోగం సాధించాలని ఉద్యోగార్థులకు రాష్ట్ర ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ పిలుపునిచ్చారు. మొబైల్స్ వాడకాన్ని తగ్గించాలని పోటీ పరీక్షలకు ప్రిపేరయ్యే అభ్యర్థులకు కేటీఆర్ సూచించారు. ముస్తాబాద్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పోటీ పరీక్షలకు ప్రిపేరవుతున్న అభ్యర్థులకు స్టడీ మెటీరియల్ను కేటీఆర్ పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. జీవితం చాలా పెద్దది.. అపజయం ఎదురైనంత మాత్రాన కుంగిపోవద్దని చెప్పారు. నైపుణ్యం ఎప్పటికప్పుడు అప్డేట్ చేసుకుంటే ప్రయివేటు రంగంలో ఎన్నో అవకాశాలు ఉన్నాయన్నారు. నీళ్లు, నిధులు, నియామకాలే లక్ష్యంగా సాధించుకున్న తెలంగాణలో.. ఎన్నో అద్భుతాలు సృష్టించామని పేర్కొన్నారు. సాగునీటి రంగంలో ప్రపంచంలోనే అతిపెద్ద ఎత్తిపోతల పథకం కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించామన్నారు. సాగునీటిని అందించడంతో బీడు భూములు కూడా సస్యశ్యామలం అయ్యాయని తెలిపారు. అభివృద్ధికి ప్రామాణికాలైన తలసరి ఆదాయం, జీఎస్డీపీలో ముందంజలో ఉన్నామని కేటీఆర్ స్పష్టం చేశారు. మన నిధులు మన కోసమే ఖర్చు చేసుకుంటున్నామని చెప్పారు.

స్వరాష్ట్రం ఏర్పాటైన నుంచి ఇప్పటి వరకు ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ రంగ సంస్థలలో 1 లక్షా 32 వేల ఉద్యోగాలను భర్తీ చేశామని కేటీఆర్ తెలిపారు. కొత్తగా 80 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసే ప్రక్రియ కొనసాగుతుందన్నారు. టీఎస్ ఐపాస్ ద్వారా ఎనిమిదేండ్లలో 19 వేల పరిశ్రమలు స్థాపించేలా చేసి, 16 లక్షల మందికి ఉపాధి అవకాశాలు కల్పించామని పేర్కొన్నారు.

## కల్నల్ సంతోష్ బాబు త్యాగం చిరస్మణీయం : మంత్రి జగదీష్ రెడ్డి



సూర్యాపేట, జూన్ 15: దేశం కోసం ప్రాణాలర్పించిన కల్నల్ సంతోష్ బాబు చరిత్రలో చిరస్మరణీయుడిగా నిలిచి పోతారని విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డి అన్నారు. భారత్–చైనా సరిహద్దుల్లో జరిగిన యుద్ధంలో అసువులు బాసిన మహవీరచక్ర దివంగత కల్నల్ సంతోష్ బాబు రెండో వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి మంత్రి ఘనంగా నివాలులర్పించారు.

కాసరబాద్ రోడ్డులోని స్మృతి వనంలో కుటుంబ సభ్యులు ఏర్పాటు చేసిన సంతోష్ బాబు విగ్రహాన్ని మంత్రి జగదీష్ రెడ్డి ఆవిష్కరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. సంతోష్ బాబు మరణానంతరం ముఖ్యమంత్రి కేసీఆర్ అందించిన సహాయ సందేశం ఇతర రాష్ట్రాలతో పాటు యావత్ భారతదేశానికి స్ఫూర్తివంతమైన సందేశాన్ని చేరవేసిందన్నారు.

ఆర్మీలో పనిచేసే ప్రతి ఒక్కరికి రేపటి రోజున వారి కుటుంబాలకు భారత ప్రజలు అండగా ఉంటారు అనేది ముఖ్యమంత్రి కేసీఆర్ అందించిన సందేశం అని ఆయన చెప్పారు. కార్యక్రమంలో సంతోష్ కుమార్ భార్య సంతోషి, కుటుంబసభ్యులతో పాటు మున్సిపల్ చైర్పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, గ్రంథాలయ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్ గౌడ్, మార్కెట్ చైర్మన్ ఉప్పల లలిత, జడ్పీటీసీ జీడి భిక్షం, టీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వై.వీ, మాజీ మున్సిపల్ చైర్మన్ జుట్టుకొండ, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల భాగస్వామ్యంతోనే గ్రామాల అభివృద్ధి : మంత్రి ఎర్రబెల్లి

వరంగల్, జూన్ 15: ప్రజల భాగస్వామ్యంతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యం. పల్లె ప్రగతితో చిన్నచిన్న గ్రామాలు సైతం అభివృద్ధి చెందుతున్నాయని పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. జిల్లాలోని రాయపర్తి మండలం కాట్రపల్లెలో మంత్రి పల్లె ప్రగతి కార్యక్రమంలో పాల్గొని బైక్ ర్యాలీ నిర్వహించారు. మోటర్ సైకిల్ మీద ప్రయాణించారు.

అనంతరం గ్రామంలో పర్యటించి పారిశుద్ధ్యం, మురుగునీటి కాలువలు, మిషన్ భగీరథ మంచినీటి సరఫరా వంటి పలు అంశాలను పరిశీలించి, గ్రామస్తులతో మంత్రి మాట్లాడారు. గ్రామంలో రూ.4 లక్షలతో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాన్ని ప్రారంభించారు.

గ్రామ యూత్ తో కలిసి వాలీబాల్ ఆడారు. గ్రామంలో కోటి రూపాయలతో చేపట్టిన అంతర్గత రోడ్లు, మురుగునీటి కాలువలు, కాట్రపల్లి నుంచి రేగుల రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. గ్రామంలో సెంట్రల్ లైటింగ్ సిస్టమ్ ని మంత్రి ప్రారంభించారు.

మన ఊరు మన బడి కింద గ్రామ పాఠశాల ఆధునీకరణకు రూ.83 లక్షలతో శంకుస్థాపనలు చేశారు. గ్రామంలో సఫాయి కార్మికులతో కలిసి చెత్త ఎత్తి ట్రాక్టర్ లో పోశారు. అలాగే గ్రామంలో మొక్కలు నాటారు. అనంతరం గ్రామ పాఠశాలలో జరిగిన పల్లె ప్రగతి లో




మంత్రి గ్రామ అభివృద్ధి మీద సమీక్ష చేశారు. 38 మహిళా స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు లింకేజ్ కింద 3 కోట్ల 5 లక్షలు చెక్కులను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అభివృద్ధి, సంక్షేమ రంగాలకు అధిక ప్రాధాన్యమిస్తున్నది కేవలం సీఎం కేసీఆర్ మాత్రమేనని తెలిపారు. తెలంగాణలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకనే ప్రతిపక్ష పార్టీలు కుట్రలు చేస్తున్నాయని మండిపడ్డారు. వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెట్టాలని కేంద్రంలోని బిజేపీ కుట్రలు చేస్తుంది. కేసీఆర్ గొంతులో ప్రాణం ఉండగా రైతులకు నష్టం జరుగదన్నారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ గోపి స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## ఉద్యమ స్ఫూర్తితో చెన్నూరును అభివృద్ధి చేస్తున్న ఎమ్మెల్యే సుమన్ : మంత్రి వేముల

హైదరాబాద్, జూన్ 15: నాటి ఉద్యమ స్ఫూర్తితోనే చెన్నూరు ఎమ్మెల్యే బాల్క సుమన్ నియోజకవర్గాన్ని ముందుకు తీసుకెళ్తున్నారు. గొప్ప కార్యదీక్ష గల నాయకుడు సుమన్ అని రోడ్లు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. జిల్లా పర్యటనలో భాగంగా చెన్నూరు నియోజకవర్గంలో ఎమ్మెల్యే సుమన్తో కలిసి మంత్రి పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు.

ఈ సందర్భంగా మంత్రి వేముల మాట్లాడుతూ..ఎమ్మెల్యే సుమన్ ప్రజలకు ఇచ్చిన మాట కోసం బాధ్యతగా పని చేస్తున్నారు. ముఖ్యమంత్రి ఆశీర్వాదంతో రాష్ట్రంలోనే ఏ నియోజకవర్గానికి రానన్ని నిధులు చెన్నూర్ నియోజకవర్గానికి వచ్చాయన్నారు.

చెన్నూరు ఎత్తిపోతల పథకానికి రూ.1658 కోట్ల నిధులు తీసుకొచ్చిన మహా ఘనుడు బాల్క సుమన్ అని ప్రశంసించారు.

చెన్నూరు ఎత్తిపోతల పథకం పూర్తయితే ముఖ్యమంత్రి కేసీఆర్ పేరు, బాల్క సుమన్ పేరు చెన్నూరు నియోజకవర్గ చరిత్రలో శాశ్వతంగా నిలిచిపోతుందని మంత్రి పేర్కొన్నారు. తెలంగాణలో అమలవుతునన సంక్షేమ పథకాలు దేశంలో మరెక్కా



లేవన్నారు. రాష్ట్రానికి ఒక్కపైసా తీసుకురాని ప్రతిపక్షాలవి అర్థం లేని వాదనలని కొట్టిపారేశారు.

వేరే రాష్ట్రంలోని బీజేపీ, కాంగ్రెస్ నేతలే తెలంగాణ సంక్షేమ పథకాలను మెచ్చుకుంటున్నాయి.

అబద్ధాలతో పబ్బం గడుపుకోవాలనుకునే నాయకుల మోసపూరిత మాటలు ప్రజలు నమ్మొద్దన్నారు. పనిచేసే ప్రభుత్వాన్ని, నాయకులని ప్రజలు కాపాడుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే సుమన్ మాట్లాడుతూ.. చెన్నూరు నియోజకవర్గ చరిత్రలో నేడు నిలిచిపోయే సుదినం అన్నారు. ముఖ్యంగా కోటపల్లి మండల ప్రజల చిరకాల స్వప్నం తుంతుంగ వాగుపై 8 కోట్ల రూపాయలతో నిర్మించిన బ్రిడ్జి శంకుస్థాపన చేసుకోవడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు.

ఈ బ్రిడ్జి ప్రజలకు అందుబాటులోకి రావడం వల్ల కోటపల్లి మండలంలోని ఏదులబంధం, సిర్సా, పుల్లగామ, రొయ్యల పల్లి, ఆల్గామా, జనగామ, వెంచపల్లి గ్రామాల దశాబ్దాల కష్టాలు తొలగిపోతాయని ఎమ్మెల్యే తెలిపారు. తెలంగాణ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లో విస్తృతంగా చర్చ పెట్టాలన్నారు.


ఆహ్వానం



4·5 కిన్నెర

కిన్నెర ఆర్ట్ థియేటర్స్

హైదరాబాద్

ప్రముఖ కవి
డా॥ ఎన్. గోపి
73వ జన్మదినం సందర్భంగా
గ్రంథావిష్కరణలు

డా॥ ఎన్. గోపి బృహత్కవితా సంపుటి
'మనిషిని కలిసినట్టుండాలి'

డా॥ ఎస్. రఘు సంపాదకత్వ నిర్వహణలో
నిరంతర
('ఎన్. గోపి సాహిత్యంపై విమర్శ, సమీక్షావ్యాసాల' ప్రత్యేక సంచిక)

తేది: ఆదివారం 26 జూన్, 2022, సాయంత్రం 5 గంటలకు
తెలుగు విశ్వవిద్యాలయం ఆడిటోరియం, నాంపల్లి, హైదరాబాద్

ముఖ్యఅతిథులు - ఆవిష్కర్తలు :
శ్రీ వంగల హర్షవర్ధన్
ప్రముఖ సాహితీ వేత్త - 'మనిషిని కలిసినట్టుండాలి' ఆవిష్కర్త
శ్రీ కె. రామచంద్రమూర్తి
ప్రముఖ సీనియర్ పాత్రికేయులు - 'నిరంతర' ఆవిష్కర్త

అధ్యక్షులు :
డా॥ వోలేటి పార్వతీశం
ప్రముఖ సాహితీవేత్త

విశిష్ట అతిథి :
ఆచార్య సూర్యాధనంజయ్
ఉస్మానియా తెలుగుశాఖ పూర్వ అధ్యక్షులు


చరిత్రలో నేటినిజం





కం॥ ఆపదల నియమములలో
నా హక్కులు లో తన వారు నమరితే నిలుపుకొనే
సాహసిగా పేరొందిన
వీ.హను మంతుని గాలు ఖు విమలా త్రినో ధాగన్ !!

–రాధశ్రీ
సెల్: 9494481210

(జూన్ 16 వీ.హనుమంతరావు పుట్టినరోజు..)







నేటినిజం
# సాహితీ కెరటాలు

E-mail : netinijam93@gmail.com website: www.netinijam.com

2 హైదరాబాద్ ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 గురువారం 16-6-2022

## ఒక సమస్తం

ఎన్నో క్షణాలు తపస్సులా మారి
చుట్టూ పరచుకున్న ఒక ఆలోచనల అమవస
కొంచం కొంచం అయిష్టంగా కరిగి కరిగి
వెలుతురు చారలు పాకినట్టు
నాలోకి నేను ఒకింత చూపును సారించినా
నా చుట్టూ చీకట్లు సందడి చేసినా
వెలుగులు విహరి0చినా
నాలోలోపలి నందన వనమై
వేసవి ఎడారుల వడగాడ్పుల మధ్య
పన్నీటి చినుకై రాలి అన్నింటా వసంతాన్ని
మొలిపించే చిరునవ్వు పలకరింత
ఒక పసి ఊహ లాలిపాటై ........
వద్దనే అనిపిస్తుంది
అయినా ఇసుక ఎడారుల మధ్య
ఎడాపెడా తరుముకు వచ్చే ఎ0డమావులూ
ఏకాంత పయనాలకూ మధ్య
అక్షరం అక్షరానికీ జీవాన్ని పోసి
అణువణువునూ బంగారపు పుప్పొడిలా
అలదుకున్న గుప్పెడు ఘడియలే
అనుక్షణం శ్వాసిస్తూ
రెండు సమా0తర పాలపు0తలుగా ............
అయినా ఒక తియ్యని ఊహ
రేపెప్పుడో చెలియలి కట్ట దాటి
అడుగులో అడుగునవుతానన్న
వెయ్యి జాబిలి వెలుగుల ఒక కల
మాటిమాటికీ బరువెక్కి ఒక్కొక్క చినుకునూ జారుస్తూ
విచారం ముసిరిన శ్రావణ మేఘపు నీటి మూటలవుతూ
మనసును కట్టిపెట్టిన కను రెప్పలు
వణికిన పెదవుల అంచులపై
మాట రాక తడబడుతూ
తత్తరపాటును అదుముకున్న
అనుభవాల పురాప్రదర్శన
చూపులనిండా తొణికిసలాడే
తొలకరి చిత్తడి
చూపుల వెనకా మాటల మధ్యా
ఊహకూ ఊపిరికీ నడుమ తారట్లాడుతూ
మన అతీతపు ఉన్మత్తత
అదే ఒక గతం ఒక భవిష్యత్తు
ఒక వర్తమానం



-స్వాతీ శ్రీపాద
8297248988

## ఆత్మవంచన

అగుపించని దేవుడికి
అవసరానికి మించిన ఆరాధన
అగుపించే ప్రకృతే
ప్రత్యక్ష దైవమని తెలియక.
ఆత్మవంచన చేసుకుంటూ
పూనుకుంటారు నిత్యం
ప్రకృతి విధ్వంసానికి పరోక్షంగా.

భక్తి భావంతో ఒక వైపు
సృష్టిస్తారు చెట్టును 'కల్పవృక్షంగా.
'కలప' కొరకు మరో వైపు
ఆ చెట్టునే తెగ నరుకుతారు
నిర్దాక్షిణ్యంగా.

గుట్టల గుండెల్ని చీల్చి..
మలుస్తారు పాలాభిషేకానికి
ఒక రాయిని విగ్రహంగా
తొలుస్తారు మరో దాన్ని
పాదం మోపడానికి తొక్కుడు బండగా.

కనిపెంచిన తల్లిదండ్రులు
కళ్ల ముందే ఉండగా
కనిపించని దేవుడి దర్శనానికై
గుళ్లూగోపురాల తీర్థ యాత్రలు.

కుటుంబ పెద్దలు, గురువుల కాళ్లకు
నమస్కరించే సంస్కృతి లేదు కానీ
ఎవడో 'కోన్ కిస్కాగాడి'కి
శిరస్సు ఆనించి పాదాభివందనం.

ఆశ్రమాల చుట్టూ తిరుగుతూ
అడ్డమైన వారి కాళ్లపై
సాష్టాంగపడే కొత్త ఒరవడికి
శ్రీకారం చుట్టారు
నేటి అభినవ సంస్కృతికి చిహ్నంగా.

అందుకే
అనిపిస్తుంది అప్పుడప్పుడు
మనుషులది
ఓ వెర్రి జాతి అని.



-ఆచార్య కదారు వీరారెడ్డి
9392447007





జీవిత పరుగుపందెంలో
అందరి కన్న ముందుండి
విజయ పరంపరలో
చుట్టూ చూస్తే
నేను "ఒంటరిని"–
అందుకే
గెలవటం కాదు–
గెలుపు పంచుకోవటం ముఖ్యం!



-డా॥విప్లవ్‌దత్ శుక్లా
సెల్:9849185878

## గజల్

మత్లా
నీపెదాల మాధుర్యము తాకలేదు నా హృదయం!
మల్లెవనం పూలచాటు దాగలేదు నా హృదయం!!

షేర్
వలపుపూల తేరునెక్కి వెన్నెలలో తిరుగుతుంది
ఆవెన్నెల వెండివెలుగు చేరలేదు నా హృదయం

దేవదాసు ప్రేమకథను విపులంగా చదువుకుంది
మజ్నుపడిన వేదనెంతొ చూడలేదు నా హృదయం

గోదావరి అలసిరులను దేహమంత తడుపుకుంది
ఒక్కనీటి చుక్కకూడ తడపలేదు నా హృదయం

మబ్బుతీగ వానచినుకు మయూరమై ఆడుకుంది
నాట్యానికి నాధమయ్యి పాడలేదు నా హృదయం.

పాపమేదొ పుణ్యమేదొ జరిగిపోయె పరమేషా
రెండింటిని సమానంగ కలపలేదు నా హృదయం



-గణపురం పరమేశ్వర్
7013333911

## త్వరలో నిజామాబాద్ 'జిల్లా సమగ్ర స్వరూపం' పుస్తకావిష్కరణ



కమిటీ సభ్యులతో చర్చిస్తున్న కన్వీనర్ అమృతలత

తెలంగాణ సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో రూపొందించిన "జిల్లా సమగ్ర స్వరూపం" పుస్తకాన్ని త్వరలో ఆవిష్కరించనున్నట్లు పరిషత్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె.చెన్నయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ 33 జిల్లాల చరిత్ర, సంస్కృతి, సాహిత్యం, కళలు, జానపద విజ్ఞానం, జాతరలు, పండుగలు, పురాతన కట్టడాలు, వ్యవసాయం, విద్య తదితర అనేక అంశాలపై వెలువరిస్తున్న గ్రంథాలను రూపొందిస్తున్న నేపథ్యంలో 'నిజామాబాద్ జిల్లా సమగ్ర స్వరూపం' పుస్తకం రూపుదిద్దుకుంటున్నదని పేర్కొన్నారు. ప్రముఖ రచయిత్రి డాక్టర్ జి. అమృతలత కన్వీనర్‌గా కోర్ కమిటీని ఏర్పాటు చేయగా, డాక్టర్ కాసర్ల నరేశ్‌రావు, డాక్టర్ వి. త్రివేణి, డాక్టర్ శారదాహన్మాండ్లు, కందకుర్తి ఆనంద్, కిరణ్‌బాల, డాక్టర్ గణపతి, అశోక శర్మ, చింతల శ్రీనివాసగుప్తాతో కూడిన కమిటీ వివిధ అంశాలపై జిల్లాకు చెందిన పరిశోధకులతో వ్యాసాలు రాయించిందన్నారు. పరిషత్ అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి అధ్యక్షతన త్వరలో నిజామాబాద్‌లో పుస్తకావిష్కరణ, కవి సమ్మేళనం కార్యక్రమాలను నిర్వహిస్తామని పేర్కొన్నారు.

## కలలు ఎవరివి

ముళ్ళల్లో రాళ్ళల్లో
చలి లో వాన లో
శ్రమైక జీవన సౌందర్యం
చూస్తున్న
కష్ట జీవి
ఆకలి చుక్కలు లెక్కిస్తున్న
మాట నిజం.

నా దేశం ఎవరిది
నా సంపద ఎవరిది
శ్రమ ఎవరిది
స్వర్గం ఎవరికి

నా దేశం నాది కాదు
నా కష్ట ఫలితం నాకు దక్కదు
వర్షం నీరు సముద్రం లోకి
వృధాగా పోయినట్టు
నా శ్రమ కార్పొరేట్ సామ్రాజ్య
దోపిడీ చేతుల్లో
వైభోగం అనుభవిస్తున్నది.

శ్రమ నాదే
ఫలితం నాది కాదు

శ్రమ నాదే చెమట నాదే
ధర నాది కాదు

అమ్మకం హక్కు నాది కాదు
ఊపిరి నాదే
జీవితం నాది కాదు

చీకటి బతుకు నాది
వెలుగు ఎవరికి
శ్రమ జీవి జీవితం లో
కలలు ఎవరివి ?



-సిరిసిల్లా
గఫూర్ శిక్షక్
9849062038

## చైతన్యం

కత్తి తిప్పి చూడు
నీ సామర్థ్యం
కొందరికే తెలుస్తుంది.

కాలం విదిలించి చూడు
నీ కాంతి పథం
విశ్వమంతా వ్యాపిస్తుంది.



-వి.సూర్యారావు
92469 11234

## ఘంటారావం

నిలదీస్తేనే
నిజం బయటికొస్తుంది
వలవేస్తేనే
చేప చేతిలోకొస్తుంది.

నిరుత్సాహపరుస్తున్నా
నీ అడుగులు ఆపకు
అవరోధాలకు వెరవని
ఐలమ్మను మరువకు.

శత్రుపక్షంలో మిత్రపక్షముంటే
పక్షపాతం
మిత్రపక్షంలో శత్రుపక్షముంటే
పక్షవాతం



-గంటా మనోహర్‌రెడ్డి
సెల్:9949992964

## శీలా వీర్రాజుది సాహిత్యంతో పెనవేసుకున్న జీవితం

నిండుగా జీవించి, జీవితమంతా సాహిత్యంతో పెనవేసుకున్న విలువైన నిబద్ధతతో కూడిన శీలా వీర్రాజు గడిపారని పలువురు వక్తలు అన్నారు. శీలా వీర్రాజు సంస్మరణ సభను హైదరాబాద్‌లో ఆదివారం నిర్వహించారు. ప్రజాసాహితి వీర్రాజుపై వెలువరించిన జూన్ విశిష్ట సంచికను నాళేశ్వరం శంకరంతో పాటు పలువురు ప్రముఖులు సుధామ, శివారెడ్డి, నగ్నముని, నిఖిలేశ్వర్, బి.యస్.రాములు, డా॥ నందిని సిధారెడ్డి, కొండేపూడి నిర్మల, వారాల కృష్ణమూర్తిలతో కలిసి ఆవిష్కరించారు. మొదటి కాపీని సుభద్రాదేవికి అందించారు. వీర్రాజు 'మైనా' నవలను హిందీలోకి అనువదించిన పుస్తకాన్ని ఆయన బతికి ఉండగా వీర్రాజు చేతిలో పెట్టలేకపోనని ఆయన చిత్రపటం ముందు ఉంచారు. వీర్రాజు చిత్రపటానికి శీలాసుభద్రాదేవి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. సంస్మరణ సభలో ప్రముఖులు ఎన్.గోపి, డా॥ భట్టు లక్ష్మీనారాయణ, బైసదేవదాసు, శిఖామణి, విహారి, శిలాలోలిత, ప్రసాదమూర్తి, ప్రసాదమూర్తి, చంద్రశేఖర రెడ్డి, వి.ఎస్.ప్రకాశరావు, కుందుర్తి కవిత, ఏ.ఎల్.కిస్మత్ కుమార్, ప్రభాకర్, గోపాలంలతో పాటు పలువురు సాహిత్యకారులు, చిత్రకారులు, కుటుంబసభ్యులతో పాటు బంధువులు నివాళు లర్పించారు.







శీలావికి నివాళులర్పిస్తున్న కె.శివారెడ్డి. ● ప్రత్యేక సంచికను ఆవిష్కరిస్తున్న ప్రముఖులు. ● హాజరైన ఆత్మీయులు

## కవి అక్షరాలు ఆయుధాలు కావాలి

తెలుగు ఉపాధ్యాయుడైన శేషం సుప్రసన్నాచార్యులు పద్యం, వచన కవిత, లలిత గీతాల సృజనలో సిద్ధహస్తులు. శేషంవారు తన మలి వచన కవితా సంపుటిని "హిమాల యాలకు చెమట పడుతుంది" అంటున్నాడు. శీర్షికతోనే సిక్సర్ సాధించిన ఈ కవితపై పాఠకుడు దృష్టి సారించక మానడు.

**"ప్లాస్టిక్ నే భోంచేస్తూ.. తన్మయత్వంతో**
**అంతమొందించుకుంటూ**
**మనిషి తనకు తానే రాసుకుం టున్న**
**మరణ శాసనాన్ని చూసి..**
**కాలుష్య కోరలతో విషాన్ని విరజిమ్మే**
**కాలనాగుల్లాంటి**
**ఫ్యాక్టరీ స్వైర విహారాన్ని చూసి..**
**మనిషి తనను తానే**
**చంపుకుంటున్న వైనాన్ని చూసి**
**అజ్ఞానపు ఆధునిక**
**వైజ్ఞానిక దారిద్ర్యాన్ని చూసి**
**హిమాలయాలకు చెమట పదు తుంది"** అంటున్నాడు కవి.

పర్వత మంత అభివృద్ధి అయినా పరిరక్షించు కోకపోతే నీరుగారి ఆవిరైపోతుందని కవిభావం.

తన చుట్టూ వున్న సమాజాన్ని నిశితంగా గమనించే సుప్రసన్నాచార్యులు పర్యావరణ విధ్వంసాన్ని తీవ్రంగా నిరసిస్తాడు. అనేక కవితల్లో ఈ ధోరణి ప్రస్ఫుటంగా గోచరిస్తుంది. సమాజంలోని అకృత్యాలు, వేళ్లూనుకుబోయిన అవినీతి, దయనీయమైన జాలర్ల జీవితాలు, కనుమరుగవుతున్న మానవ సంబంధాలు, వ్యాపార మయమవుతున్న వైద్య విధానం, వంటి అనేక సామాజిక అంశాలు ఆయన కవితా వస్తువులైనాయి.

తల్లిదండ్రుల ప్రాముఖ్యతను తెలియజేస్తు
**"సంసార విశ్వాన్ని, అమూలాగ్రంగా**
**దర్శించే దర్శనాలు**
**ఆ నేత్ర ద్వయమే**
**అమ్మానాన్నలు!"** అనడం బాగుంది.





తల్లి మనసును ఆవిష్కరిస్తు..
**"నాయినను ఓల్డేజ్ హోంలో పడేసి**
**అమ్మను పని మనిషిగా కుదుర్చుకున్నప్పుడు**
**బిడ్డా! నువ్వూ కోడలూ క్షేమంగా వుంటే**
**అదే పదివేలని వెట్టిచాకిరి చేస్తుంది**
**అదే మాతృప్రేమ"** వంటి వాక్యాలు సూదుల్లా గుచ్చుకుంటాయి.

నాన్న తక్కువ తిన్నాడా?
**"నాన్న.. పరమేశ్వరుడై**
**శ్రీ మన్నారాయణుడై**
**అనేక ప్రమదాలనుంచి కాపాడుతాడు– అంతెందుకు**
**కొత్త జీవితానికి అన్నిహంగులతో**
**ఏరి కోరి మరీ మరీ నొసట అక్షరాలు దిద్దే**
**అపరబ్రహ్మ.. నాన్న"**

నిజమే! అమ్మ జన్మనిస్తే నాన్న జీవితాన్ని యిస్తాడు.. జీవించడం నేర్పిస్తాడు.

"చీకటి పడటంతోనే నిన్ను కాపాడటానికి
కంకణం కట్టుకుని పహారాకాస్తాడు"

ఎవరు? జవాను.. అదే సైనికుడు. దేశం యావత్తూ నిద్రిస్తుంటే అతను మాత్రం "రాత్రి సూర్యుడి"లా వెలుగులీనుతుంటాడు.

**"చీకటి దేవుడై మనకు**
**తీయని స్వప్నాలకు ప్రసాదిస్తాడు**
**అతని క్యాలెండర్‌లో పండుగలూ, పబ్బాలూ, సెలవులూ**
**అన్నీ మనల్ని వాడుకొమ్మని**
**అతడు ఒంటరి జీవిగా మిగులుతాడు!"**

యిలా సైనికుడ్ని శ్లాఘిస్తు
**"ఎప్పుడైనా సూర్యుడు ఒంటరిగానే ఉంటాడుకదా!"**
అంటు ముక్తాయిస్తాడు. సెల్యూట్ జవాన్!!!

**"ఒక్క క్షణం యోచించు**
**బ్రతకడానికి.. ఎన్నో, ఎన్నెన్నో**
**దారులు నీ కోసం ఎదిరిచూస్తున్నాయి**
**ముందు జీవితాన్ని ప్రేమించు!"**

క్షణికావేశంతో ఆత్మహత్యలకు పాల్పడుతున్న యువతను ఉద్దేశించి రాసిన పంక్తులు యివి. జీవితాన్ని ప్రేమించేవాడు జీవన పయమనంలో అర్థాం తరంగా ఆగిపోడు. అపజయాలను, అనుభవాలుగా, అవకాశాలుగా మలుచుకుని లక్ష్యంవైపు దూసుకెళ్తాడు. విజయాన్ని సాధిస్తాడు. వ్యక్తిత్వ వికాసాన్ని ప్రబోధిస్తు 'ఒక్క క్షణం' ఆలోచించమంటు యువతను అర్థిస్తున్నాడు కవి.

**"ధర్మ పక్షపాతి అపరభీష్ముడు**
**జయశంకర్‌సారు!**
**తెల్లని సూర్యుడు**
**ధవళ మందారం!**
**శ్వేతోద్యమ సారథి!"**

సైనికుడు రాత్రి సూర్యుడవుతే.. తెల్లని సూర్యుడు జయశంకర్‌సార్ అని కీర్తిస్తున్నాడు సుప్రసన్నాచార్యులు చక్కని నివాళి!

మహాకవి దాశరథిని సాహితీయుద్ధవీరుడిగా వర్ణిస్తు.. బహుభాషా కోవిదుడైన పీవీ నరసింహారావును తెలుగు రీవిగా అభివర్ణిస్తు రాసిన కవితలు పాఠకులను అలరిస్తాయి.

సుప్రసన్నాచార్యులు జీవితంలో ఓ విషాద సంఘ టన సంభవించింది. ఎంతో గారాబంగా పెంచుకున్న కూతురు సుహాసిని పిన్న వయస్సులో కన్నుమూసింది. కన్న కూతురు కళ్ళ ఎదుటే కళ్ళు మూస్తే కన్న తండ్రికి కలిగే బాధ, ఆవేదన, దుఃఖం అనిర్వచనీయం. ఈ నేపథ్యం నుండి పొంగి పొరలిన దుఃఖ కవిత "లేఖా భరణం" ఈ కవితను చదవండి. కళ్ళు చెమర్చక మానవు. గొప్ప 'ఎలిజీ'.

**'కవి అమ్ములు పొదిలోని**
**అక్షరాలు ఆయుధాలౌతాయి"** అంటున్న శేషంవారు కవి కలం నుండి వెలువడే అక్షరాలు ఆభరణాలుగా కాదు.. ఆయుధాలుగా వుండాలి అనే సందేశం అందిస్తున్నారు.

చక్కటి ఊహ, చిక్కటి పద ప్రయోగ సామర్థ్యం పుణికి పుచుకున్న సుప్రసన్నాచార్యులు కవిత్వాంశ సడలకుండా ముమ్ముందు మంచి కవిత్వం సృజిస్తారని కవన ప్రియులు ఆశించవచ్చు.

**ప్రతులకు:** జవహర్ నవోదయ విద్యాలయం
గ్రా॥ వట్టెం, మం॥ బిజినేపల్లి
జిల్లా: నాగర్ కర్నూలు
రాష్ట్రం:తెలంగాణ– 509 203
సెల్: 9000245963



– రమణ వెలమకన్ని
సెల్: 9866015040

## ప్రజాగొంతుకగా నిలిచిన రాఘవాచారి సంపాదకీయాలు



సంపుటిని ఆవిష్కరిస్తున్న కె. శ్రీనివాస్‌రెడ్డి, సురవరం, నారాయణ, వెంకట్‌రెడ్డి

దేశంలో తొంబైశాతం మీడియా పాసిస్టు మోదీ చేతుల్లోకి వెళ్లిపోయిందని, దేశంలో బీజేపీ మతచిచ్చు పెడుతుంటే దానికి మీడియా పెట్రోల్ పోసి మరింత వివాదం చెలరేగేలా చేస్తోందని సీపీఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి విమర్శించారు. ప్రముఖ పాత్రికేయుడు, విశాలాంధ్ర పూర్వ సంపాదకుడు సి.వ రాఘవాచారి సంపాదకీయాలను క్రోడీకరించి రూపొందించిన 'నివాళి' రెండవ సంపుటిని ఆదివారం హిమాయత్‌నగర్‌లోని ముఖ్దుం భవన్‌లో ఆవిష్కరించారు. సురవరంతో పాటు సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టన్ కె. నారాయణ, రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి, సీనియర్ జర్నలిస్ట్ కె. శ్రీనివాస్‌రెడ్డి, రాఘవాచారి ట్రస్ట్ నిర్వాహకులు రాఘవాచారి సతీమణి కే. జ్యోత్స్న, సాహిత్య అకాడమీ పురస్కార గ్రహిత అంపశయ్య నవీన్ తదితరులు పాల్గొన్నారు. విశాలాంధ్ర సంపాదకులు ఆర్‌వీ రామారావు అధ్యక్షతన జరిగిన సభలో సురవరం మాట్లాడుతూ రాఘవాచారి సంపాదకీయాల్లో అత్యధిక భాగం ఇప్పటి పరిస్థితులకు అద్దం పడుతోందని అన్నారు. సోషల్‌మీడియాను పూర్తిగా అందిపుచ్చుకున్న మతతత్వ ఫాసిస్టు శక్తులు పూర్తిగా దుర్వినియోగం చేస్తూ విషప్రచారం చేస్తున్నాయని పేర్కొన్నారు. అంపశయ్య నవీన్ మాట్లాడుతూ వామపక్ష భావజాలమే తమను మరింత దగ్గర చేర్చిందని అన్నారు. కె.నారాయణ మాట్లాడుతూ రాఘవాచారి జీవితం తెరిచిన పుస్తకం అని అన్నారు. చాడా వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి మాట్లాడారు.

## మట్టి

(కథ)

పెరట్లో మొక్కల సంరక్షణలో తన్మయం చెందిపోతున్న భార్య సుమిత్రని చూస్తూ "తెల్లారిందా!అప్పుడే చెట్లూ పుట్టలూ పట్టావు!" అన్నాడు విసుగ్గా వంటింటి గుమ్మంలోంచి తొంగిచూస్తూ విశ్వనాధరావు.

"లేచారా? వస్తున్నా, కాఫీ కలిపిస్తా పదండి" అంటూ చేతులు కడుక్కుని లోపలికి వచ్చింది సుమిత్ర.

ఆదివారం ఆఫీసుకి సెలవు కాబట్టి హాయిగా ఆలస్యంగా లేస్తాడు విశ్వనాధరావు. పొద్దున్నే, హడావిడిగా వంటా టిఫినూ పని తొందర ఉండదు కాబట్టి ఆదివారాలు పొద్దున్న కాసేపు మొక్కల్లోకి వెళ్లిపోయి ప్రతి ఆకూ, ప్రతి మొగ్గా, ప్రతి పువ్వూ చూసుకుంటూ వాటిని పలకరిస్తుంది సుమిత్ర. రోజూ సాయంత్రాలు వాటికి సేవలు చేస్తూ పలకరిస్తూ నీళ్ళు పోస్తూ కొత్తగా తొడిగిన మొగ్గలు, పూర్తిగా విచ్చుకున్న పువ్వులు, లేలేత చిగుళ్ళు అన్నీ చూస్తూ మురిసిపోతూ ఉంటుంది.

ఇంట్లో పిల్లలు కన్నవాళ్ళవనీ, పెంచుకున్నవాళ్ళ వనీ రోజు రోజూ వారి ఎదుగుదల చూస్తూ తల్లితండ్రులు ముచ్చటపడినట్టే సంతోషిస్తుంది మొక్కల్ని చూసుకుంటూ. వాటికి సేవ చెయ్యడంలో బద్ధకించదు.

అందుకు పూర్తిగా విరుద్ధం విశ్వనాధరావు మనస్తత్వం అంటే చెడ్డవాడని కాదు. మరి ఏ ఇతర విషయాల్లోనూ సుమిత్ర పనికి అడ్డురాడు కానీ మట్టి మొక్కలు అంటే తగని చిరాకు అతనికి. "డబ్బు పడేస్తే ఎన్ని పువ్వు కావాలంటే అన్ని పువ్వులు, ఏం కూరలు కావాలంటే ఆ కూరలు కొనుక్కునే స్థితిలో డబ్బుకి లోటు లేని సంసారం కదా మనది! ఆ మొక్కల పిచ్చేమిటి నీకు?" అంటూ విసుక్కుంటూ ఉంటాడు. నవ్వొస్తుంది సుమిత్రకి. విశ్వనాధరావు కాదు విసుగులరావు అని పేరు పెట్టాలి అనుకుంటుంది మనసులో.

"బయట బజార్నించి బుట్టెడు పూలు కొని తెచ్చినా మన పెరట్లో ఒక్క పువ్వు పూసిన ఆనందాన్ని ఇవ్వలేవండీ" మృదువుగా చెప్తూ అర్థం చేసుకోమంటుంది.

"ఇంకా నీ చాదస్తం. పోనీ తోటమాలిని పెడతాను అంటే అదీ కాదంటావు".

"మన పెరడు చిన్నదే కదండీ. తోటమాలెందుకూ? ఆ మాత్రం శారీరక శ్రమ అవసరమే! చెట్లకి నీళ్ల తోడిపొయ్యాలా ఏమన్నానా? నీళ్ళు పైపుతోనే కదా! కాస్త మొక్కల చుట్టూ మట్టి సరిచేస్తుండడం, బోదెలు తవ్వుతుండడం, పాదులు కడుతుండటం ఈ పనులు రోజూ ఉండవుగా మరేం ఫరవాలేదు. అసలు నిజం చెప్పాలంటే తెల్లిగ్గా కాస్త తోటపని చేసుకుంటుంటే మనసుకి హాయిగానూ ప్రశాంతంగానూ ఉంటుంది తెలుసా? బాగా వయసు పైబడిన అప్పుడు చెయ్యలేనేమో! ఇప్పుడు నాకిదే మంచి కాలక్షేపం వ్యాయామం రెండూనూ.."

"ఇంకొకటి చెప్పడం మర్చిపోయావు! మనింట్లో పూసినవి ఓ రెండు పూలైనా దేవుడి పటానికి పెడితే ఎంతో సంతోషంగా ఉంటుందండీ అని అసలేదేం పాపం?"

"ఉన్నమాటేగా అది" చిరునవ్వుతో అంది సుమిత్ర.

"చిన్నప్పుడు ఆటలాడుకునేటప్పుడు కూడా నేను మట్టిలో చేతులెప్పుడూ పెట్టలేదు. అంత అసహ్యం నాకు మట్టి అంటే" ఎంత అసహ్యమో చెప్తున్నట్టు భర్త గొంతు అదో రకంగా ధ్వనించడం గమనించింది. గొప్పవాళ్ళిం ట్లో ఒక్కడే సంతానం. కందిపోతాడన్నట్టుగా పెంచారు. అది సహజమేనేమో! కానీ సుమిత్ర కూడా ధనవంతుల ఇంట్లోనే పుట్టి పెరిగిన జమీందారీ పోజులు పెట్టడం ఏ మాత్రం ఇష్టంలేని వ్యక్తి.

ఆ రోజు స్నేహితుడి తమ్ముడి పెళ్ళికి గుంటూరు బయల్దేరాలి విశ్వం. రాత్రి ముహూర్తం. కార్లో వెళ్ళి మళ్ళీ మర్నాడు తెల్లవారుజామునే బయల్దేరి వచ్చె య్యాలని ఆలోచన. "కొద్దిగా గొంతు గరగర మొదలైంది సుమిత్రా! గాలిలో మార్పో ఏమిటో" అన్నాడు భార్యతో.

"ఎక్కువ అవకముందే తగ్గించుకునే ప్రయత్నం చెయ్యడం మంచిది కదా! ఉండండి ఒక్క నిమిషం" అంటూ గబగబా పెరట్లోకి వెళ్ళి:ది సుమిత్ర. తులసి ఆకులేసి టీ కాచి ఒక కప్పు తాగమని ఇచ్చి ఒక కప్పు ఫ్లాస్కులో పోసిచ్చింది. "గుంటూరు చేరే లోపల మళ్ళీ ఇంకోసారి ఇందులోది తాగేసెయ్యండి చల్లారిపోకా ముందే" అంటూ

"ఇందాక పక్కింటావిడొచ్చి ఏదో సబ్జాగింజలు అంటున్నారేమిటి? బయటికి నడుస్తూ యాదాలాపంగా అడిగాడు ఆ పేరు కొత్తగా అనిపించి.

"ఆవిడకి వేడి చేసినట్టుగా ఉందిట. సబ్జా గింజలు నీళ్ళల్లో వేసి మరిగించి కాస్త చిక్కగా చేసుకుని ఉప్పుగానీ, పంచదాక గానీ వేసుకుని తాగితే చలవ చేస్తుంది. ఇమ్మని అడిగింది. నేను సబ్జాబొక్కలు కూడా వేశానులెండి..."

"ఇంకనేం సగం డాక్టర్రై పోయావు. నోటిపూత వస్తే ఆడేవిటీ ఆ మొక్కలేవో వేశావు. వాటి ఆకులు పెసరపప్పుతో కలిపి వండి పెట్టేస్తున్నావు. మనలో మన మాట రుచిగానే ఉంటోందిలే.."

"ఔనండీ! మా అమ్మ కామాక్షి ఆకులు అనేది వాటిని. నోటిపూత బాగా తగ్గిస్తాయి. మన వీధిలో చివరింట్లో అద్దెకి ఉన్నారు చూడండి మామీ. ఆవిడ కూడా అప్పుడప్పుడొచ్చి ఆ ఆకులే కాదు కాయలు కాస్త పలకమారినవి కోసుకెళ్ళి మజ్జిగలో ఊరేసి ఎండబెట్టి ఒరుగులు చేసుకుంటారు. ఆ మొక్కల్ని తమిళంలో మనతక్కాళి అంటారుట" భర్త వింటున్నాడు కదా అని కళ్లింత చేసుకుని ఆగకుండా చెప్తోంది సుమిత్ర.

"చాలు బాబోయ్! చాలు! నీ మొక్కల పిచ్చి కాదు గానీ వంటలు, ఒరుగులు తమిళ భాషా అన్నీ నాక్కూడా నేర్పేలా ఉన్నావు. వచ్చిన ఒక్క తెలుగు భాషా తడబడి పోతుంది పాపం. నీక్కావాలంటే రోజూ ఓ బుట్టెడు ఆ మనతక్కాళీయో. వాళ్ళతక్కాళీయో తెప్పిస్తాను ఎక్కడి నించి అయినా సరే. ఆ మట్టిలోకి వెళ్ళడం మానెయ్యి" చిర్రుబుర్రులాడుతూ బయల్దేరిపోయాడు విశ్వనాధరావు.

బుగ్గలు నొక్కుకుంటూ నిలబడిపోయింది సుమిత్ర. రామాయణమంతా విని అన్నట్టుగా చివరికి ఈయన గారు తిప్పి తిప్పి నా మొక్కలకి ఎసరు పెడుతున్నారే!

మర్నాడు పొద్దున్నే పెళ్ళివారింటినించి కారు డ్రైవ్ చేసుకుంటూ బయల్దేరాడు విశ్వనాధరావు. ఇంకో గంటలో తన ఊరు వచ్చేస్తుండగా కడుపులో తిప్పడం మొదలైంది. పెళ్ళి భోజనంలో తనకి ఇష్టంలేని పదా ర్థాలే ఎక్కువ ఉన్నాయి. వద్దు వద్దంటుంటే చాలా బల వంతం చేసి మొండిగా అతిగా తినిపించాడు స్నేహితుడి బావమరిది. అదే ఇప్పుడీ వికారపెట్టడానికి కారణం అని అర్థమైంది. వద్దు అంటుంటే గట్టిగా అరుస్తూ మాట్లాడుతున్నాడు. ఏదో గొడవ అయిపోతోందనుకుని నలుగురూ ఇటే చూస్తున్నారని ఇష్టం లేకపోయినా తినేశాడు. ఇప్పుడది ప్రతాపం చూపిస్తోంది. వాంతి ఆపుకోలేక కారు ఓ పక్కకి పెట్టి మరీ కారుకి దగ్గర్లో వొద్దనుకుని కొంచెం దూరంగానే వెళ్ళాడు. వరసగా రెండు వాంతులయ్యాయి. బట్టలమీద చాలా పడింది. ఇంకా ఆగకుండా వస్తున్నట్టే ఉంది.అసలు ఏం జరుగుతోందో తెలియనట్టు అయోమయంగా అయిపోయాడు. నిలదొక్కుకోలేక గోతిలో కాలుపడి పూర్తిగా కిందపడిపోయాడు. లేవాలని ఎంత ప్రయత్నించినా కొంచెం కూడా కదల్చలేకపోతున్నాడు శరీరాన్ని. ఇంతలో ఓ కారు వస్తూ కనిపించడంతో ప్రాణం లేచి వచ్చినట్టయింది. కారు కాస్త దగ్గరకి రాగానే ఎడమచేత్తో ఆపమన్నట్టుగా సైగ చేశాడు. కారు మెల్లిగా ఆగింది కానీ అందులో ఉన్న ఇద్దరు యువకులూ మందు ప్రభావంలో ఉన్నారు. పడిపోయిన విశ్వనాధరావుని చూస్తూ పగలబడి నవ్వుతూ 'మనకంటే ఎక్కువ పుచ్చుకున్నాడు వీడెవడో! కింద పడుకుని ఎలా దొర్లుతున్నాడో! అని రకరకాలుగా వ్యాఖ్యానించుకుంటూ రయ్యిన వెళ్ళిపోయారు.

అటువైపుగా తోటలో పనిచేస్తున్న ఇద్దరు నడివయసు వాళ్ళు చూడటమేమిటి పరిగెత్తుకు రావడమేమిటి జరిగిపోయింది. అరచేతులనించీ మోచేతుల వరకూ, కింద పాదాలనించి మోకాళ్ళవరకూ మట్టిపూత పూసినట్టు ఉన్నారు ఇద్దరూ. వాళ్ళు కష్టపడి తనని లేవదీస్తుంటే వాళ్ళ చేతుల బురద తన బట్టలకి మాత్రమే కాదు, మొహానికీ, తలకీ కూడా బాగా అంటుకోవడం తెలుస్తోంది విశ్వనాధరావుకి. కార్లో వెళ్లిన ఆ ఇద్దరు యువకులూ కళ్ళముందు కదిలారు. మరుక్షణం ఈ ఇద్దరి చేతులవంకా చూశాడు. వారి చేతులకున్న మట్టిని చూస్తుంటే ఏ మాత్రం అసహ్యం అనిపించట్లేదు ఇప్పుడు. ఆ మట్టి చేతులనే కళ్ళకి అద్దుకోవాలనిపిస్తోంది.

నీళ్ళ దగ్గరకి తనని తీసుకుని వెళ్ళి బాగా కడిగి తుడిచి గుడిసెలోంచి తెల్లని పంచె చొక్కా తెచ్చి కట్టబెడుతుంటే వాటిముందు కింద పడేసిన ఎంతో ఖరీదైన తన బట్టలు వెలవెలపోయాయి.

హోదా, డాబూ, దర్పం, జమిందారీ దర్జా అన్నీ మరుగున పడిపోయినట్టయింది. మర్నాటినించీ సుమిత్రకంటే ఎక్కువగా తానే మొక్కల్లో మట్టిలో తిరుగాడుతున్న దృశ్యం కళ్ళముందు కనబడుతోంది.

మనస్ఫూర్తిగా చేతులు జోడించాడు. ఆ నమస్కారం ఎదురుగా ఉన్న ఈ ఇద్దరికి మాత్రమే కాదు. మట్టికీ, మట్టిలో పనిచేస్తున్నవాళ్ళందరికీ కూడా.



-తమిరిశ జానకి
9441187182







12

# దయ

“ఈ నవలలో ఎన్నో పాత్రలు. కొన్ని సజీవ పాత్రలు. మరికొన్ని మాజీ ప్రధాని పీ.వీ. రాసిన 'లోపలి మనిషి' నవలలోలాగ సజీవ పాత్రలను కలగా పులగం చేసిన చిత్రణ. కొన్ని ఊహాత్మక పాత్రలు. కొన్ని ఆదర్శ పాత్రలు. వీటిక్కూడా మూలరూపాలు... లేకపోలేదు” అని రచయిత బి.యస్. రాములు అన్నారు. ఆలోచింపజేసి, చైతన్య పరచే ఈ 'చూపు' నవలను ప్రతిరోజు నేటినిజం పాఠకులకోసం...

– సంపాదకులు.

ఆ రోజు లెక్చరర్ మానసకి పెళ్ళి చూపులు. పేరుకే పెళ్ళి చూపులు. అందరూ తెలిసిన వాళ్ళే. తల్లిదండ్రులు చిన్నప్పటి నుండి స్నేహితులు, క్లాస్‌మేట్స్ కూడా. ఫార్మాల్టీ కోసమే పెళ్ళి చూపులు. పెళ్ళి ఖాయమనట్టే అని అనుకొని ఏర్పాటు చేసిన పెళ్ళి చూపులు.

చిన్ననాటి స్నేహితురాళ్లు రమ్య, జయలను పెళ్ళి చూపుల రోజు తప్పకుండా వుండాలని పిలిచింది మానస.

ఉదయం నుండి రమ్య, జయ మానస ఇంట్లో పెళ్ళి పిల్లను చేసినట్లు హడావిడి చేస్తున్నారు. ఏ చీర కడితే బాగుంటుందో. హెయిర్ స్టయిల్ ఎలా ఉంటే బాగుంటుందో వగైరా చర్చిస్తూ ప్రయోగాలు చేస్తూ హడావిడి చేస్తున్నారు.

పెళ్ళి చూపుల్లో అందరూ తెలిసిన వాళ్లే. ఎమ్ఈవో సత్తయ్య పట్టుబట్టి మొత్తానికి పెళ్ళి చూపుల దాకా తీసుకు వచ్చాడు. ఆ విషయం తల్లి మాధవికి తెలుసు. తండ్రి ప్రిన్సిపాల్ రామచంద్రయ్యకు తెలియదు. మొదట్నుండి అనుకున్నట్టుగానే పెళ్ళి చూపులకు వచ్చారని అనుకుంటున్నారు.

పెళ్లి చూపులు ప్రారంభమయ్యాయి.

టీ, టిఫిన్‌లు అందరికీ అందించబడ్డాయి.

చేరో కుర్చీలో వధువు, వరుడు ఎదురెదురుగా.

ఒకవైపు దయాకర్. మరోవైపు మానస.

వాళ్లిద్దరినీ కాసేపు పెద్దలు పలకరించారు. వారి వివరాలను, క్వాలిఫికేషన్స్‌ను, అభిరుచులను, వారి చేతే చెప్పించారు. వారు వినయంగా సంక్షిప్తంగా అందరికీ వినబడేటట్టు చెప్పారు. దాంతో పెద్దలంతా సంబంధం చక్కగా వుందని సంతోష పడ్డారు. ఫస్ట్ ఇంటర్వ్యూలో సెలక్ట్ అయ్యారని ప్రిన్సిపాల్ రామచంద్రయ్య, ఎమ్ఈవో సత్తయ్య మనసులో అనుకున్నారు

మానస ఇంత అందంగా వుంటుందా అని దయాకర్ ఆశ్చర్యపోయాడు. ఎప్పుడు చూసినా రెగ్యులర్ డ్రెస్‌లలో కనపడేది. ఈ రోజు ప్రత్యేకంగా లైట్ పింక్ కలర్ చీర కట్టుకుంది. మ్యాచింగ్ గాజులు. మ్యాచింగ్ చెవిదుద్దులు. మ్యాచింగ్ కర్చీఫ్ కూడా. మ్యాచింగ్ బొట్టు.

దేవకన్యలా వుంది అని మనసులో అనుకున్నాడు దయాకర్. సినిమాల్లో దేవకన్యలు ఇలాగే కనిపిస్తుంటారు.

జయ, రమ్య హాల్లో కాస్త ఎడంగా కూర్చున్నారు. తల్లులు ఇంకా లోపలికి డైనింగ్ హాల్లో కూర్చుని ముచ్చటిస్తున్నారు.

కుశల ప్రశ్నలయ్యాక పాత స్నేహితులు ఏవో ముచ్చట్లల్లో పడ్డారు.

దయాకర్ మానసను రెండు, మూడు ప్రశ్నలు వేసి ఆగిపోయాడు.

మానస దయాకర్‌ని తల ఎత్తి సరిగ్గా చూడలేకపోయింది.

ఇదేదీ గమనించకుండా స్నేహితులు ముచ్చట్లలో పడ్డారు.

సమయం గడుస్తుంటే మానసకి కాస్త ఇబ్బందిగా వుంది.

మానస తల్లి మాధవి అది గమనించినట్టుగా వుంది.

తల్లి మాధవి అది గమనించి లోపలికి రమ్మని సైగ చేసి తీసుకు పోయింది.

అందరూ రిలాక్స్ అయ్యారు. గుసగుసల్లా సాగిన ముచ్చట్లు బహిరంగ చర్చలా సౌండ్ పెంచేశారు.

“మేన సంబంధాలైతే మెడలు పట్టి పెళ్ళి చేసే వాళ్లు. బంధుత్వాలు ఇలా కొన్ని హక్కులు కల్పిస్తయి. స్నేహాల్లో ఇష్టాయిష్టాలే తప్ప హక్కులు లేవు. అలా హక్కులు వుండి వుంటే మాధవి వెంకటేశంతో పోట్లాడి మానసను ఇచ్చి పెళ్లి చేస్తుండె.”

“ఇప్పటికైనా ఏమైంది? మాధవికి, మానసకు ఆ హక్కు లేదా?”

“ఎంతైనా సొంత అన్నాచెల్లెళ్ల మధ్య మేన సంబంధాల మధ్య వుండే హక్కులు ఉండవు కదా!”

దయాకర్ అసంతృప్తిగా కదిలాడు.

తన ఉనికిని ఎవరూ గుర్తించకుండా వాళ్లు మాట్లాడుకోవడం దయాకర్‌కు అసహనంగా వుంది.

అది గమనించిన దయాకర్ తల్లి వాణికి మాధవికి చెవిలో ఏదో చెప్పింది.

దయాకర్‌ను లోపలి గదిలోకి ఆహ్వానించింది మాధవి.

పెద్దవాళ్ళ చర్చ సాగుతూనే వుంది.

“రక్త సంబంధాల ద్వారా ఏర్పడే హక్కులు, బాధ్యతలు వెనకటి కాలానికి సంబంధించిన ప్రొటోకాల్స్. హక్కులెన్నో... బాధ్యతలన్ని! మేన సంబంధాలు అనివార్యమనుకుంటే స్నేహ సంబంధాల్లో సంబంధాలు కుదుర్చుకోవడం ఐచ్చికం...”

“ఇప్పుడు ఇష్టాయిష్టాలకే ప్రాధాన్యత పెరిగింది. మేన సంబంధాలు ఎవరు చేసుకుంటున్నరు? మునుపు చంకలో పిల్లలనెత్తుకొని చంకపిల్లగాండ్లకు పెళ్లిళ్లు చేసే వాళ్లు. మగపిల్లవాడు పొట్టిగా, ఆడపిల్ల పొడుగ్గా పెరిగినా నడిచిపోయిన కాలం అది. వెనకటి కాలమే కొన్ని విషయాల్లో మంచి గనిపిస్తది. ఉమ్మడి కుటుంబాలు ఒక ఊరిలోనే అందరూ బతకడం అనేది పోయి ఉద్యోగాలు వచ్చి బదిలీలతో ఊరికింత బూడిద పోసుకుంటూ వెళ్లడం వల్ల కుటుంబాలన్నీ వేరయిపోయినయి.”

“ఇప్పుడు సొంత అన్నదమ్ములు కూడా ఎవరి సంపాదన వారిదంటు న్నరు. తల్లిదండ్రుల ఆస్తికే సమానత్వం అంటున్నరు. అన్నదమ్ములు సంపాదించింది సమానంగా పంచుకునే హక్కు లేదంటున్నరు. ఎవరిష్టం వాళ్లంటున్నరు. నచ్చిన పిల్లనే చేసుకుంటామంటరు. కులం చూసేది లేదు. ఖాన్‌దాన్ చూసేది లేదు. ఫ్యామిలీ బ్యాక్‌గ్రౌండ్ చూసేది లేదు.

ఇవన్నీ గుర్తు చేస్తే పెళ్ళయిన తర్వాత ఎక్కడి వాళ్ళక్కడ వెళ్లిపోతరు. ఎప్పుడో రెండేళ్లకొకసారి కలుసుకుంటరు. పిల్లపిల్లగాడు మంచిగుంటే చాలు అనుకుంటున్నరు. కేవలం చదువు, ఉద్యోగం, అందం చూసి మెచ్చుతున్నరు. మళ్లా అడిగినంత కట్నం కావాలనుకుంటున్నరు. కట్నాలు, పెళ్లి ఖర్చులు పెరుగుతున్నయి. ఒకరిని చూసి ఒకరు అట్టహాసంగా పెళ్లి చేస్తున్నరు. అప్పుల పాలవుతున్నరు. అక్రమ సంపాదన వున్న వాళ్లు ఎంతైనా ఖర్చు చేస్తరు. నిజాయితీగా బతికే వాళ్లకే కష్టాలు... కట్నం తక్కువ తీసుకుంటే తక్కువ స్థాయి వాళ్లని అనుకుంటరని, అవసరం లేకపోయినా కట్నం ఎక్కువ డిమాండ్ చేయడం ఫ్యాషన్ అయిపోయింది.”

“అన్నీ కుదిరితే మన మధ్య కట్నాల సమస్య సమస్యే కాదు.”

“తండ్రికి ఇష్టం లేకపోయినా కట్నం అడిగే కొడుకులు పెరుగుతున్నరు.”

“కట్నం పైసలు తనకే వస్తాయని పెళ్లి కొడుకు ఆశ. పెట్టిన బంగారం తప్ప ఇచ్చిన లక్షల రూపాయలు గాలికి కొట్టుకుపోతున్నయి. ఏం మిగులుతున్నయి? ఎంత చెట్టుకు అంతగాలి. ఎంత కట్నానికి అంత భారీ ఖర్చు. నన్నడిగితే ప్రతి నెలా మొదటి ఆదివారం, సెకండ్ సాటర్‌డే, సండేలలో ప్రభుత్వమే పెళ్లి ఫంక్షన్స్‌ను ప్రకటించాలె. పేర్లు నమోదు చేసుకునే వాళ్లకు పెళ్లిళ్ల రిజిస్ట్రార్ పెళ్లి జరిపించాలె. ఇటు యాభై, అటు యాభైమందికి భోజనాలు పరిమితి విధించాలె.”

“ఈ వ్యక్తిగత స్వేచ్ఛ, ఇష్టాయిష్టాలు అనేవి మునుపు ఇంతగా లేవు. ఉమ్మడి కుటుంబం ఉన్నప్పుడు వ్యక్తిగత స్వేచ్ఛ చాలా పరిమితుల్లో ఉండేది. వ్యక్తి కుటుంబాలు రావడంతో వ్యక్తి స్వేచ్ఛ బాగా పెరిగింది. పారిశ్రామిక రంగం ఒక వైపు, ప్రభుత్వ ఉద్యోగాలు మరోవైపు విస్తరించినయి. దాంతో ఉమ్మడి కుటుంబాలను వదిలి ఉద్యోగం వెతుక్కుంటూ వెళ్లిపోయి స్థిరపడ్డరు. మగవాడి సంపాదన మీద ఆధారపడి బతికే స్థితి వల్ల స్త్రీలు బలహీనులయిన్రు. మగవాడు అడిగే పెద్దలు లేక ఆడింది ఆట, పాడింది పాటగా సాగించు కున్నరు. తల్లిదండ్రులకు చెప్పుకోవడం వల్ల వచ్చే లాభం ఏమీ లేకపోగా వారు నిరంతరం బాధపడుతుంటరని కూతుర్లు తమ సంసారం గురించి చెప్పుకొనే వారు కాదు.” అన్నాడు ప్రిన్సిపాల్ రామచంద్రయ్య.



ఆర్‌డీవో వెంకటేశం అవునంటూ తల ఊపాడు.

“అయితే ప్రజాస్వామ్యం, ప్రభుత్వ యంత్రాంగం అధికారాన్ని పలు స్థాయిల్లో పంపిణీ చేసింది. ఒకరిపై మరొకరికి అధికారాన్ని కట్టబెట్టింది. ఈ అధికారం కూడా వ్యక్తి స్వేచ్ఛకు దారి తీసింది. అధికారమే వ్యక్తి స్వేచ్ఛకు మూలమని నా అభిప్రాయం. ఉమ్మడి కుటుంబంలో అధికారం పెద్దవాళ్ల చేతుల్లో ఉండేది. అందుకని మిగతా వాళ్లకు వ్యక్తి స్వేచ్ఛ ఉండేది కాదు. ఎప్పుడైతే కుటుంబాలు విడిపోయో ఎవరి జీతం వారికి చేతికి చిక్కిందో అప్పుడే వ్యక్తి స్వేచ్ఛ పెరుగుతూ వచ్చింది.” అన్నాడు ఆర్‌డీఓ వెంకటేశం.

“అదేం కాదు. డబ్బుతోనే వ్యక్తి స్వేచ్ఛ పెరిగింది. నెలనెలా జీతం చేతుల్లో పడ్డంక ఎవరిష్టం వచ్చినట్టు వాళ్లు బతక నేర్చిన్రు. తాగే వాళ్లు తాగిన్రు. పేకాట ఆడేవాళ్లు పేకాట ఆడిన్రు. తిరిగే వాళ్లు తిరిగిన్రు. ఇతర రంగాల్లో పెట్టుబడి పెట్టే వాళ్లు పెట్టుకొని అదనంగా సంపాదించిన్రు. కొందరు ఎంత జీతం వచ్చినా అప్పులు చేసుకుంటూ వడ్డీలు కట్టిన్రు. పాన్‌లు, సిగరెట్‌లు, బీరు, బ్రాందీ వంటి వ్యసనాలు డబ్బు చేతికి వచ్చింతర్వాతే పెరిగింది. ఎలా ఉద్యోగాలు, పరిశ్రమలు పెరుగుతూ కార్మిక వర్గం, ఉద్యోగ వర్గం, మధ్య తరగతి ఎదిగిందో అదే క్రమంలో సారా, ఫారెన్ లిక్కర్ అమ్మకాలు, సిగరెట్లు, వ్యభిచారం వంటి వ్యసనాలు పెరిగినయి. అందువల్ల వ్యక్తి స్వేచ్ఛకు డబ్బే మూలమంట.” అంటూ వాదించాడు ఎంఈవో సత్తయ్య.

లోపల గదిలో దయాకర్ కుర్చీలో ఒంటరిగా కూర్చున్నాడు. దయాకర్ పరిస్థితి దయనీయంగా ఉంది. ఆ చర్చ అంతా వినపడుతూనే ఉంది. పెళ్లి చూపులకని వచ్చి ఇక్కడ కూడా ఇదే సోదేనా? అంటూ విసుక్కున్నడు దయాకర్.

కాసేపటికి ఏవో స్వీట్స్ తీసుకొచ్చింది మానస తల్లి మాధవి.

కొంతసేపటికి సిగ్గు పడుతూ, సంకోచిస్తూ మానస వచ్చి తలవంచుకుని నిలబడే వుంది.

“కూర్చో” అన్నాడు దయాకర్. “బాగున్నవా? మనం కలుసుకోక చాలా కాలమైంది కదా!” అంటూ కుశల ప్రశ్నలు వేశాడు.

మానసకు కూర్చోవడం కాస్త ఇబ్బందిగా వుంది.

దయాకర్ కుర్చీని కాస్త ఎడంగా జరుపుకుని మానసను మళ్ళీ కూర్చోమని కుర్చీ చూపించాడు.

అది మరీ దగ్గరగా ఉండడంతో సంకోచంగా ఉండిపోయింది.

కుర్చీలో కూర్చోకుండా మంచం అంచుపై కూర్చుంది మానస.

ఏమడగుతాడోనని మానసలో సంకోచం. ఏమడగాలో తోచక దయాకర్‌లో సంకోచం.

“ఎమ్మెస్సీ ఏ కాలేజీలో చేసినవు?” అంటూ పలకరింపుగా అడిగాడు దయాకర్.

ఆబ్జెక్టివ్ టైప్ ప్రశ్నలకు జవాబులాగా “ఓయూ క్యాంపస్‌లో” అంది మానస.

“నీ జీవిత లక్ష్యం ఏమిటి?”

“ఇంకా నిర్ణయించుకోలె. పెళ్లయ్యాక జీవిత లక్ష్యం నిర్ణయించుకుంట.”

“అంటే ఆడవాళ్లకు పెళ్లే జీవిత లక్ష్యం అని భావిస్తున్నవా?”

“అదేం కాదు. జీవిత లక్ష్యాలను ఇద్దరూ కలిసి నిర్ణయించుకుంటే బాగుంటది. లేకపోతే సంఘర్షణ పెరుగుతది.”

“అమెరికాలో ఆడవాళ్లు కూడా ఒక జీవిత లక్ష్యాన్ని నిర్ణయించుకుంటరు. అది సాధించే క్రమంలో కృషి చేస్తరు. అందుకు సహకరించే వారినే ఆ క్రమంలో పరిచయమై సన్నిహితమైన వారిని నచ్చితే పెళ్లి చేసుకుంటరు. నువ్వేమో పెళ్లయ్యాక లక్ష్యం నిర్ణయించుకుంటానంటున్నవు.” నవ్వుతూ అన్నాడు దయాకర్.

ఆశ వున్నప్పుడు అణకువతో వుంటారు. ఆశ కోల్పోయినప్పుడు నిరాశలోనైనా పడతారు. వినయాన్ని వదిలి ధైర్యంగా ఎదిరిస్తారు. ఈ సంబంధం సెటిల్ కాదని ఏమూలో మానసకు అపనమ్మకం. అందుకని... నిర్భయంగా వాదించింది మానస.

“అది అమెరికా! ఇది ఇండియా! ఇండియాలో లక్ష్యాలు నిర్ణయించు కోవడంలో మగవాళ్లకు స్వేచ్ఛ ఉంది తప్ప ఆడవాళ్లకు ఎక్కడిది? తల్లిదండ్రులే అన్నీ నిర్ణయిస్తరు. పెళ్లయ్యేదాకా వాళ్లు, పెళ్లయిన తర్వాత భర్త, వయస్సు పెరిగినంక పిల్లలు స్త్రీల జీవితాన్ని, లక్ష్యాలను కంట్రోల్ చేస్తుంటరు. అందువల్ల లక్ష్యాలు వున్నప్పటికీ బయటపడకుండా రాజీ పడుతుంటరు. అవకాశం వున్నప్పుడే తమ భావాలను, లక్ష్యాలను తెలుపుతరు. ఉదాహరణకి వాణి ఆంటీకి పెళ్లి కాకముందు ఆర్ట్, డ్రాయింగ్, పెయింటింగ్ మీద బాగా ఇంట్రస్ట్. ఇప్పుడు అంకుల్‌కు ఉండే పని ఒత్తిడి వల్ల ఆర్టిస్ట్‌గా ఎదగ గలిగిందా? కానీ ఆంటీ ఎంత గొప్ప ఆర్టిస్టో మీ ఇంట్లో వున్న పెయింటింగ్స్ చూస్తే ఎవరికైనా తెలుస్తది.”

అవును నిజమే. మమ్మీ ఎంత బాగా పేయింటింగ్స్ వేస్తుందో! అనుకున్నాడు దయాకర్.

అలా స్వేచ్ఛగా మాట్లాడుతున్న మానసను చూస్తుంటే హాల్లో చూసినప్పటి కన్నా వేరుగా కనిపించింది దయాకర్‌కు. గతంలో చూసినప్పుడు మానస పట్ల వేరే అభిప్రాయం వుండేది. నిజానికి ఏ అభిప్రాయం ప్రత్యేకంగా లేకుండేది. ఇప్పుడు సంభాషణతో, ఆత్మవిశ్వాసంతో మాట్లాడుతుంటే మానస ఎంతో అందంగా, ఆకర్షణీయంగా కనపడుతోంది. బొమ్మలాగా పెళ్లి చూపుల్లో కూర్చోబెట్టడంలో ఏం తెలుస్తుంది? మనిషి హావభావాలతో, బాడీ లాంగ్వేజ్‌తో స్వేచ్ఛగా మాట్లాడుతున్నప్పుడే వారి వ్యక్తిత్వం, స్వభావం, అందం వ్యక్తమవు తుంది. కాని ఈ పెళ్లి పెద్దలు ఉన్నారే...! కనీసం అలా మాట్లాడ్డాన్ని సహిం చరు. ఏది మాట్లాడబోయినా పెద్దలే మాట్లాడతారు. అమ్మాయిని మాట్లాడ నివ్వరు... అబ్బాయిని మాట్లాడనివ్వరు.

అనుకున్నాడు దయాకర్.

“ఉద్యోగం చేయాలనుకుంటున్నవా?”

“ముందే చెప్పిన గదా! మీకు ఇష్టమైతే చేస్త.”

“నా ఇష్టం కాదు.. ఒరిజినల్‌గా నీ అభిప్రాయం ఏమిటి?”

“నాకు ఉద్యోగం చేయాలనే వుంది. చదివిన చదువుకు సార్థకత అది ఇతరులకు అందించినప్పుడే కదా!” చిరునవ్వుతో అంది మానస.

“అంటే నీ ఉద్దేశ్యం టీచింగ్ ప్రొఫెషన్‌లో నీకు ఇంట్రెస్ట్ అన్నమాట.”

“అవును. నాన్న లాగా చదువు చెప్తు చదువుకోవచ్చు. ఎదగవచ్చు. మనం చెప్పే దానికన్నా ఎక్కువ నేర్చుకోవచ్చు. విద్యార్థులు ఎదుగుతుంటే ఎంతో సంతోషంగా వుంటది. ఎవరెవరో విద్యార్థులు ఎదిగిన తర్వాత నాన్నను కలిసి పోతుంటే చాలా సంతోషం వేస్తుంది. ఈ ఫీడ్‌బ్యాక్, జాబ్ శాటిస్‌ఫ్యాక్షన్ ఎడ్యుకేషన్ ఫీల్డ్‌లో తప్ప మరే ఫీల్డ్‌లో ఇంత గొప్పగా ఉండదు. నాన్న ఆరోగ్య రహస్యం కూడా అదేనని చెపుతుంటడు.” చొరవగా అంది మానస.

“మీరు మాట్లాడుతుంటే చాలా అందంగా వుంటరు” అంటూ నవ్వాడు దయాకర్.

మానస సిగ్గు పడిపోయింది. “అంటే సహజంగా అందంగా వుండనా?” అంటూ నవ్వింది.

“నవ్వినప్పుడు ఇంకా అందంగా వుంటవు. ఒరిజనల్‌గానే నువ్వు చాలా బాగుంటవు. చిన్నప్పటినుంచి చూస్తున్నగదా!”

ఆ మాటతో మానసకు గిలిగింతలు పెట్టినట్టయింది. దయాకర్ వైపు చూస్తూ మరోసారి సన్నగా నవ్వింది.

“మీరేమైనా అడగండి” అన్నాడు దయాకర్.

“బహువచనం వద్దు. ఏకవచనంతో మాట్లాడుకోవచ్చు. బాగుంటుంది” అంది మానస.

“సరే! ఏదో ఒకటి అడుగు.”

“వెంకటేశం మామయ్య ఆర్‌డీవో కదా! మీకు ఎన్నో పెద్ద సంబంధాలు వస్తయి. నాన్న డిగ్రీ కాలేజి ప్రిన్సిపాల్ అయినా సాంఘికంగా, ఆర్థికంగా మీతో తూగలేం కదా! మేము మీ సంబంధం పెళ్లి చూపుల దాకా వస్తుందని అనుకోలేదు.” అంటూ ప్రశ్నార్థకంగా చూసింది మానస.

ఆ చూపుల్లో ఎన్నో ప్రశ్నలు. దయాకర్ తికమక పడిపోయాడు.

పెళ్లి చూపుల పేరిట మగపిల్లలకు టైంపాస్. మగవాళ్లు పెళ్లి చూపులను లైట్‌గా తీసుకుంటారు. ఆడపిల్లలు ప్రతి పెళ్లి చూపులు పెళ్లి కుదురుతుంది అని సీరియస్‌గా ఫీలవుతారు. మీరు కేవలం తండ్రుల స్నేహం పురస్కరించు కొని మొహమాటానికి నన్ను చూడ్డానికి వచ్చారు తప్ప నిజంగా నన్ను చేసుకో వాలని ఉద్దేశ్యంతో రాలేదు అని ఆ చూపుల్లో ఎన్నో ప్రశ్నలు కనిపించాయి. అనుకున్నట్టుగానే మానస దయాకర్ కళ్లల్లో కళ్లు పెట్టి చూస్తూ నవ్వింది. దయాకర్‌లో ఏదో సంచలనం. ఆ చూపులను తట్టుకోలేకపోయాడు. తల ఎటో తిప్పుకున్నాడు.

“నేను నీకు నచ్చిన్నా?” అంటూ అడిగాడు దయాకర్.

“నాకు నచ్చకపోతే నాన్న ఈ పెళ్లి చూపులు ఎందుకు ఏర్పాటు చేస్తరు? మీ బయోడేటా, ఫోటోలు, మీ గురించిన అన్ని వివరాలు తెలుసుకున్న తర్వాతనే సరేనన్న. నాన్నతో ఈ పెళ్లి చూపులు వద్దు అని చెప్పిన. వాళ్లతో మనం సరితూగం అని ఎంత చెప్పినా నీకేం తెలుసురా? మా స్నేహం యాభయ్యేళ్ల నాటిది. సంబంధం కుదరడానికి మా మధ్య ఆర్థిక, సాంఘిక అంతస్తులు అడ్డంకి కావు. మా స్నేహం అలాంటిది అని ఒప్పించిండు సత్తయ్య అంకుల్.”

ఆ జవాబుతో ఖంగుతిన్నాడు దయాకర్. అలాంటి జవాబు వస్తుందని ఊహించలేకపోయాడు. నాన్న కూడా తనను ఇలాగే ఒప్పించాడు. అయితే ఇంత స్పష్టంగా మానసతో చెప్పలేకపోతున్నాడు. ఏదో అందరు తృప్తి పడతారు కదా అని లైట్‌గా ఆలోచించి సరేనని ఒప్పుకున్నాడు. ఈ సందర్భంగా నాన్న స్నేహితులు, కుటుంబాలు హాయిగా మాట్లాడుకుంటారని మాత్రమే భావించాడు తాను. అంతకుమించి ఊహించలేకపోయాడు.

“నా పట్ల మీ అభిప్రాయం కోసమే పెళ్లి చూపులు ఏర్పాటు చేసిన్రు. ఆ విషయం మీకు తెలుసు. కనుక చెప్పాల్సింది మీ అభిప్రాయమే.” మళ్లీ అంది మానస.

అంత సూటిగా అడిగే సరికి విలవిలలాడిపోయాడు దయాకర్. ఏదో హాయిగా, స్నేహ పూరితంగా కాసేపు మాట్లాడుకోవచ్చు అనుకుంటే డైరెక్ట్‌గా పెళ్లికి సంబంధించిన చర్చలోకి లాగడం ఊహించలేకపోయాడు. మానస తాను అనుకున్నంత అమాయకురాలు కాదు. చాలా షార్ప్. చాలా తెలివికలది. వినయంగా వుండడం వల్ల చాలా అమాయకురాలని భ్రమ పడతాం అనుకున్నాడు దయాకర్.

“నువ్వు చాలా స్ట్రయిట్ ఫార్వర్డ్. విషయాన్ని సూటిగా మాట్లాడతవు. ఎంతైనా ప్రిన్సిపాల్ కూతురువు కదా!”

“ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్‌లో పీజీ చేసిన దాన్ని. క్యాంపస్‌లో రెండేళు ఉన్నా.” నవ్వుతూ గుర్తు చేసింది మానస.

అవులిస్తే పేగులు లెక్కపెట్టే రకం మానస అనుకున్నాడు దయాకర్. ఈమెను మాటల్లో గెలవలేం. హృదయంతో గెలుచుకోవాల్సిందే. మానసను మాటల ద్వారా మభ్యపెట్టడం సాధ్యం కాదు. చాలా దూరదృష్టిగల అమ్మాయి. చిన్నప్పుడు ఎప్పుడో మానస తొమ్మిదో తరగతి చదువుకుంటున్నప్పుడు చూశాడు. అలాగే అమాయకంగా వుంటుందనుకున్నాడు. ఆ మధ్యలో మళ్లీ చూసినా ఎప్పుడూ ఇలా ఏకాంతంగా మాట్లాడుకోలేదు. ఆడవాళ్లు గంభీరంగా, నిండుకుండలా వుంటారు. పలకరిస్తే తప్ప వాళ్ల లోతు అర్థం కాదు అనుకున్నాడు దయాకర్.

“నువ్వు చిన్నప్పుడు చాలా అమాయకంగా వుండే దానివి” అంటూ నవ్వాడు దయాకర్.

“ఇప్పుడు మాత్రం అమాయకురాలిగా కనబడ్డం లేదా?” అంటూ నవ్వింది మానస.

ఆ తరువాత యూనివర్సిటీ క్యాంపస్ విశేషాలు, ముచ్చట్లు పెట్టారు. ఒకరి గురించి ఒకరు మరింత తెలుసుకున్నారు.

“మానస ఇలా రా!” మాధవి పిలుపుతో వారి సంభాషణ ఆగిపోయింది. ఇంకా ఎంత సేపు మాట్లాడుకుంటారు అని మాధవి పిలుపు అర్థం. ఆ విషయం ఇద్దరికీ తెలిసిపోతూనే ఉంది.

గది నుండి వెళ్లబోతూ వెనక్కి తిరిగి ఓర చూపులతో చూస్తూ అడిగింది మానస.

“ఇంతకూ నీ అభిప్రాయం చెప్పలేదు దయాకర్? నేను నచ్చానా?”

మానస ఏకవచనంతో సంభోదించడం, పేరు పెట్టి పిలవడంతో దయాకర్ చకితుడయ్యాడు. అలాంటి పిలుపును ఊహించలేకపోయాడు. మానస చాలా అస్సెర్టివ్‌గా వుంటుంది అనుకున్నాడు దయాకర్. పాత స్నేహితురాలిగా, క్లాస్‌మేట్‌లాగా పలకరించిన ఆ తీరు లవబుల్‌గా వుంది అనుకున్నాడు దయాకర్. ఇంకా కాసేపు ఇలా మాట్లాడుకుంటే బాగుండేది అనిపించింది దయాకర్‌కు. మానసకు కూడా అలాగే వుంది. కాస్త చొరవగా మాట్లాడుకుంటే దయాకర్ ఖచ్చితంగా మెచ్చుతాడు అనుకుంది మానస. తన వ్యక్తిత్వంతో స్వభావంతో దయాకర్‌ను కట్టిపడేయడం అంతకష్టమేమీ కాదు అని మానసకి అర్థమైపోయింది. కానీ మాధవికి ఇష్టం లేదు. ఇప్పటికే ఎక్కువ మాట్లాడుకున్నారు అనుకుంది.

పెళ్లి పెద్దలు సత్తయ్య, వెంకటేశం, రామచంద్రయ్య ఇదేమీ గమనించడం లేదు. వాళ్లు వాళ్ల ముచ్చట్లు ఎడతెగకుండా కొనసాగిస్తూనే వున్నారు. దయాకర్ హాల్లోకి రావడంతో వాళ్ల చర్చ ఆగిపోయింది. అందరూ యధావిధిగా పెళ్లి చూపుల చర్చలోకి మూడ్ మార్చుకున్నారు.

టిఫిన్ చేసి వెళ్లండని మాధవి కోరింది. పెళ్లి చూపులకు వచ్చిన ఇంట్లో సాధారణంగా భోజనం చేయరు. గతికితే అతకదని నానుడి. వీళ్లు కొత్త వాళ్లు కాదు కాబట్టి అందరూ టిఫిన్ చేసి, టీ తాగి వీడ్కోలు చెప్పుకొని బయల్దేరారు.

రామచంద్రయ్య వాకిట్లోకి వచ్చి కారు స్టార్ట్ అయ్యే దాకా అలాగే నిలబడ్డాడు.

మాధవి కూడా అప్పుడే వాకిట్లోకి వచ్చింది.

మాధవి వెనకే మానస కూడా వచ్చింది. తల్లి చాటు నుండి దయాకర్‌కు చెయ్యి ఊపుతూ బై చెప్పింది మానస. దయాకర్ కూడా చెయ్యి వూపుతూ బై చెప్పాడు.

సంబంధం సెటిలైనట్టే అనుకున్నాడు వెంకటేశం.

“దయా! అమ్మాయి చాలా బాగుంది కదరా! ” అంది దయాకర్ తల్లి వాణి.

“అవును. నేను అనుకున్నదాని కన్నా చాలా బాగుంది. ఫోటోల కన్నా ఎంతో అందంగా వుంది. ఆమె వ్యక్తిత్వం కూడా చాలా నచ్చింది.”

“టీచింగ్ ప్రొఫెషనల్‌లో వున్న వాళ్ల పిల్లలు చాలా క్రమశిక్షణతో పెరుగుతరు. చదువులో ముందుంటరు. వినయంలో ముందుంటరు. సంస్కారం, సభ్యత అన్నీ అలవడతయి. ఎవరిని ఎలా గౌరవించాలో, అందర్నీ సమానంగా గౌరవించే సంస్కారం కూడా తెలుసుకుంటరు. నీలాగా గర్వంగా మాట్లాడ్డం అనేది టీచింగ్ ప్రొఫెషనల్‌లో వున్న పిల్లలకు రాదు. మీరేమో మా హోదాలను చూసి మనకు ఇంటికి వచ్చే వాళ్లను చూసి మీరే పెద్ద వాళ్లయినట్టు, మీకే ఆ హోదాలు, గౌరవాలు వున్నట్టు గర్వంగా ప్రవర్తిస్తరు. ఎవరినీ సరిగా రిసీవ్ చేసుకోరు. చిన్న ఉద్యోగం చేస్తున్నంత మాత్రాన వాళ్లను మీరు చిన్న చూపు చూస్తరు. నిజానికి నేనే వారిని చిన్న చూపు చూడను”.

“అమ్మా! మానస నీ పేయింటింగ్స్‌ని బాగా మెచ్చుకున్నదే... ఎప్పుడు చూసిందే...” అంటూ ప్రశ్నించాడు దయాకర్.

వాణి ఆ మాటతో ఎంతో సంతోషపడింది. అప్పుడప్పుడు వచ్చినప్పు డల్లా మానసకు చూపించి చర్చించుకున్న విషయం గుర్తు చేసింది.

“నువ్వు ఇంట్లో వుంటే కదరా! ఎప్పుడు వచ్చిందో, ఎప్పుడు పోయిందో తెలియడానికి” అంటూ వాణి కొడుకును చుట్టాలు, పక్కాలు రాగానే ఇంట్లోంచి అవతల పడే స్వభావాన్ని తప్పు పట్టింది.

“వాణి! అది సరేకాని... దయా! మనకన్నా చిన్న ఉద్యోగాలు చేసే వాళ్లు ఎప్పుడూ తక్కువ వాళ్లు కాదు. వాళ్లు డ్రాప్ అవుట్స్‌రా! వాళ్లను చదివించే వాళ్లు లేక ఇంటర్‌కో, డిగ్రీకో ఆగిపోయి ఉద్యోగాల్లో చేరిన్రు. చదివించే వాళ్లు ఉంటే వాళ్లు కూడా మనలాగే లెక్చరరో, ఆర్‌డీవోనో అవుతరు. అందువల్ల పేదరికమే వాళ్లు చిన్న ఉద్యోగాలు చేయడానికి కారణం తప్ప మరొకటి కాదు. వాళ్లు మనకన్నా ఎక్కువ కష్టపడతరు. ఎక్కువ అనుభవాలు సంపాదిస్తరు. వాళ్ల అనుభవాలే మనం పరిపాలనా దక్షులుగా నిర్ణయాలు తీసుకోవడానికి ఫీడ్ బ్యాక్ ఇస్తయి. వాళ్ల అనుభవాలు లేకపోతే మనం నిర్ణయాలు ఎలా తీసుకుంటం. నువ్వు కాస్త గర్వంగా ఉండటం తగ్గించుకో!”

“అమ్మాయి చాలా బాగుంది. తెలిసిన సంబంధం. చక్కగా వుంటుంది. ఇల్లును చూసి ఇల్లాలిని చెప్పవచ్చంటరు. మేం మెచ్చినం రా! నువ్వు ఊ. అంటే అందరూ మెచ్చినట్టే.” అంది తల్లి వాణి.

“మానస మెచ్చాల్సిన అవసరం లేదా అమ్మా?”

“మానస మెచ్చదని ఎందుకు అనుకుంటున్నవు? మనం అంటే ఎంతో గౌరవం. నాన్న అంటే మానసకు ఎంతో భయభక్తులు. చక్కని పిల్ల. మనకళ్ల ముందు పెరిగిన పిల్ల.” అంటూ వాణి మెచ్చుకుంది.

మానస తల్లి మాధవి కూతురు గురించి వాళ్ల స్థాయి గురించి చెప్పిన విషయాలు వాణికి ఎంతగానో నచ్చాయి.

మానస మెచ్చిందనే విషయాన్ని దయాకర్ చెప్పలేకపోయాడు. ఇది సమయం కాదనుకున్నాడు. తాను మెచ్చినప్పటికీ ఇంకా ఏదో కావాలని అనిపిస్తోంది. తన అరాచకాన్ని మానస భరించలేదేమో అని అనిపిస్తోంది. మానస కోరుకునే తీరులో తాను ఒక ఉదాత్తమైన భర్తగా ఉండలేడేమో.

“ఆడపిల్లలు తమ తండ్రిలా ఉండే వ్యక్తిని బాగా ఇష్టపడతరు.” అన్నాడు తండ్రి వెంకటేశం.

దయకు ఆలోచించుకునే సమయం ఇవ్వడం అవసరం అనుకున్నాడు. తండ్రి వెంకటేశం. వెంటనే అడిగితే ఒత్తిడి చేసినట్టుగా వుంటుందని నెగెటివ్‌గా రియాక్టవుతాడని డైరెక్ట్‌గా అడగలేకపోయాడు.

“నేను వాళ్ల నాన్న లాగా ఉండలేనేమో!” సందేహిస్తూ అన్నాడు దయాకర్.

ఆ సందేహం తీర్చకపోతే ఆలోచన వేరే తీరుగా సాగే అవకాశం వుంటుందని గమనించి అన్నాడు తండ్రి వెంకటేశం.

“పెళ్లయిన తర్వాత పరస్పరం చెరిసగం స్వభావాలు మారుతయి. నీకు అనుకూలంగా అమ్మాయి. అమ్మాయి అనుకూలంగా నువ్వు మారుతరు. అది అంత పెద్ద విషయం కాదు. ఎందుకంటే మనవి పాత స్నేహ సంబం ధాలు. పరస్పరం గౌరవించుకోవడం మొదటి నుంచి వున్న కుటుంబాలు మనవి. ఆ కల్చర్‌లో పెరిగిన మానస మన ఇంట్లో బాగా సూటవుతుంది.”

“ఆ పిల్ల మన ఇంటికి వస్తే లక్ష్మి ఇంటికి వచ్చినట్టే వుంటది” అంది వాణి.

దయ ఆలోచనలో పడిపోయాడు.

'మానసది ఉదాత్త, ఉన్నత వ్యక్తిత్వం. నేను ఆ స్థాయిని అందుకోలేను. ఆమెకు నేను తగను. మీరు అనుకున్నంత అమాయకురాలు కాదు మానస. చాలా తెలివైన పిల్ల. నేను చిన్నప్పుడు చూసినప్పటి మానస కాదు' అని చెప్పాలనుకున్నాడు దయాకర్. కానీ ఎందుకో అహం అడ్డం వచ్చింది.

తాను ఏవేవో ఆశలతో ఉన్నాడు. యూఎస్‌కు వెళ్ళి ఏదో పని చూసుకొని ఆ తర్వాత పెళ్ళి చేసుకోవాలనుకున్నాడు. ఆ మాటే అన్నాడు.

“పెళ్లి చూపులంటే టైంపాస్ అనుకున్నవా? అటువంటప్పుడు పెళ్లి చూపులకు ఎందుకు ఒప్పుకున్నట్టు? ఆడపిల్ల మనస్సు నొప్పించడం మంచిది కాదు. అందునా బాగా తెలిసిన వాళ్లు 50 ఏళ్ల స్నేహం. ఇలా ఎందుకు చేసినవు?” నిలదీసింది తల్లి వాణి.

“మీ బాధ భరించలేక...” అన్నాడు దయాకర్.

అవాక్కయ్యింది తల్లి వాణి.



## సమాజ నిర్వేదమే 'శాంతారావు' కవితా హృదయం మహాబాటసారి సంపుటి



**“పెన్‌కూ గన్‌కూ**
**ప్రజాస్వామ్యంపైనే కన్ను**
**ఒకటి కాపలా కన్ను**
**మరొకటి కాటేసే కన్ను”** అంటారు 'ఏ మా చిత్రం' కవితలో కె. శాంతారావు, జర్నలిస్ట్ గౌరీలంకేష్ హత్యను నిరసిస్తూ. మహా బాటసారి కవితా సంపుటిలో కె. శాంతారావు 110 కవితలు ద్వితీయ సంపుటిగా ప్రచురింపచేసారు. సమాజ నిర్వేదమే వస్తువుగా 'మనిషి కోసమే' రాసిన ప్రతి కవితలో బాధలు, కష్టాలు, అన్యాయాలు, దోపిడీపట్ల ఆవేదన బాధితుల జీవనవ్యధ తొణికిసలాడుతుంది. “మహా మార్గంలోని మహా బాటసారులకు గమనాలే తప్ప గమ్యాలుండవు కదా” అంటూ చిత్తశుద్ధి, స్వచ్ఛత,మానవత్వ విలువలు ఆశిస్తూ గమ్యం ఎంతముఖ్యమో, గమనమూ అంత ముఖ్యమే అంటూ హెచ్చరిస్తారు. శాంతారావు, వర్గాలకు వర్గ రాజకీ యాలకు అతీతంగా స్వచ్ఛమైన ప్రజాస్వా మ్యం నిరంతరం జనజీవన సంక్షేమం కోసం విలసిల్లాలని కవితాపరంగా ప్రగాఢంగా ఆశిస్తారు. 'శ్వాసాగ్ని', కవితలో జనస్వామ్య శ్వాసాగ్ని పాలకుల నుసిచేస్తుందని వార్నింగ్ యిస్తారు. 'సమాయత్తం' కవితలో, ముందుగా బంధ విముక్తిడినై అనంత స్వేచ్ఛావాయువుల్ని గుండెలనిండా పీలుస్తున్న కవిగా

**“సమయం లేదు మిత్రమా!**
**రణమా? శరణమా?”** అంటూ సన్నద్ధమవ మంటారు. చారిత్రక పరిణామ శీలతలోని ప్రజాస్వామ్య స్ఫూర్తి త్రికరణ శుద్ధిగా ఆవాహన చేసుకొంటున్న శాంతారావు కవితలు, బాధితుల హృదయాలను స్పృశిస్తున్నాయి. సాధన, శోధన, ఉపాసనగా సాగిన ఈ కవితా సంపుటి, కవి ఏ బంధనాల్లో చిక్కుకోకుండా ప్రకృతిలో, శ్రమలో, సమాజంలో, అన్నింటికన్నామించి మనిషిలో మమేకం కావాలన్న స్ఫూర్తి, ఉద్యమ చైతన్యం 'మహా బాటసారి' అందిస్తోంది.

**ప్రతులకు:** కె. శాంతారావు103, ఆదిత్య ఆర్కేడ్, బి.బ్లాక్
అజామాబాద్, హైదరాబాద్–500 020
సెల్: 9959745723

**–జయసూర్య**

పుస్తక సమీక్షలు

## గోరటి వెంకన్నపాట- పెన్నా శివరామకృష్ణ కవితా పరామర్శ



కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు విజేత, ప్రజాకవి, గాయకుడు తెలంగాణ తెలుగు పాట కీర్తి విజయ పతాక, గోరటి వెంకన్న **“ప్రకృతి పచ్చదనం నా పాటకు పత్ర హరితం”** అంటారు ఒక సంభాష ణలో. తెలంగాణ జానపద తత్వభూమికపై ప్రకృతితో మమేకమై అర్థరహితమైన ఆధునికతను వ్యతిరేకించే ప్రకృతి కవిగా గోరటి, యింత వరకు తెలుగు సాహితీ సీమలో కనీవినీ ఎరుగని అపురూప కవిత్వ తత్వాన్ని ఆవిష్క రించారు. ఎంకన్న పాటలో కవిత్వాన్ని, గతిని, లయను, భావ సౌందర్యాన్ని అర్థం చేసుకోవడానికి విపులీకరించి చెప్పడానికి ఎవరూ సాహసిం చలేని అన్వేషణను కవితా రహస్య పరిశోధకునిగా, ప్రముఖ కవి పెన్నా శివరామకృష్ణ చేపట్టడం ఎంతైనా అభినందనీయం. ఒక వాగ్గేయకారుని కవితా రీతులపై ప్రత్యేకమైన ప్రత్యేకమైన వ్యాస సంపుటిని వెలువరిం చగల ప్రజ్ఞ కలిగిన పెన్నా శివరామకృష్ణ, 'గోరటి వెంకన్న కవితా పరామర్శ' అంటే గోరటి పాటల కవిత్వంలో రచనా సంవిధానం 12 అధ్యా యాలుగా, అనుబంధంలో ఇంటర్వ్యూలు, వెంకన్న పై వ్యాసాలు, ప్రొఫైల్, సంభాషణ పొందుపరిచి సమగ్ర సంపూర్ణత అందించారు. వెంకన్న పాటలలో మౌఖిక కవిత్వ లక్షణాలు, పల్లె కన్నీరు పాట నేపథ్యం, వెంకన్న పాటలో “కంచె రేగి తీపి–1” కన్నీరొక చుక్కున్నచో.. 1” సంచార కవి, పాటల వర్ణనాత్మకత, అలంకారికత, ప్రకృతి, తెలంగానం, తత్త్వం, ఆత్మజ్ఞాని, ఆట–పాట, పెన్నా అద్భుతంగా విశ్లేషించారు. కవిత్వ వస్తు చర్చ ప్రత్యేక పదజాల నిర్మాణం, పాట పుట్టుక, మట్టి వాసన అంశాలపై మరింత లోతుగా పెన్నా అన్వేషణ కొనసాగించారు.

గోరేటి పాట: ఊట చెలిమిగా కె. శ్రీనివాస్, తొలి పలుకులు వ్యాస సంపుటికి పరిపూర్ణత చేకూర్చాయి.

**ప్రతులకు:**
పెన్నా శివరామకృష్ణ
సెల్: 94404 37200



**–జయసూర్య**
సెల్: 9014948336
9440664610

# సాహితీ వెలుగు ...సి.నా.రె

తెలుగు సాహితీ చరిత్రలో సుమగంధం సినారె. శాంతి అభ్యుధయము కలగలిసిన కవిత్వము సినారె గారిది. వచనముతో పాటు పద్యము రచించి తెలుగు పాఠకులు మెప్పించిన అపురూప ఘనత సినారే సొంతము. తెలుగు కవులలోను తొలిరాజ్యసభ సభ్యుడయి, మొట్ట మొదటిగాను కవులకు గౌరవాన్ని కల్పించిన ఘనత సినారె గారికె దక్కింది.

సాహిత్యంలో మేరుశిఖరం. అసమాన ప్రతిభావంతుడు. తెలుగు సాహిత్యం ఆయన స్పర్శకి పులకరించి మెరుగులు దిద్దుకుని కొత్త సొబగులు పోయింది. ఆషాడ శుద్ధ పౌర్ణమి రోజు 1931 జూలై 29 న కరీంనగర్ జిల్లాలోని హనుమాజీపేటలో జన్మించారు. పాఠశాలలో ఉర్దూ మాస్టారు సింగిరెడ్డి సత్యనారాయణ రెడ్డి గా ఉన్న పేరును కాస్తా సి. నారాయణ రెడ్డి గా వ్రాశారు బాల్యంలోనే హరికథలు, జానపదాలు, జంగం కథల వైపు ఆకర్షితుడైనాడు. విద్యార్థి దశలోనే అనేక గ్రంథాలు చదివి తన వ్రాత నైపుణ్యాన్ని పునాది వేసుకున్నారు . బి.ఎ. వరకు ఉర్దూ మీడియంలో చదివినా తర్వాత తెలుగు మీది అభిమానముతో తెలుగు సాహిత్యములో పోస్టుగ్రాడ్యుయేట్ డిగ్రీ, డాక్టరేటు డిగ్రీ పొందారు .తర్వాత కాలంలో తన రచనా వ్యాసంగాన్ని కొనసాగిన్తూ అన్ని అంశాలలోను సాహిత్య సృజన చేశారు.పద్య కావ్యాలు, గేయ కావ్యాలు, వచన కవితలు, గద్య కృతులు ,చలనచిత్ర గీతాలు, యాత్రా కథనాలు, సంగీత నృత్య రూపకాలు ,ముక్తక కావ్యాలు, బుర్ర కథలు ,గజళ్ళు ,వ్యాసాలు, విమర్శన గ్రంథాలు అనువాదాలు మొదలైనవి వ్రాసి సాహితీ వినీలాకాశంలొ ఎవ్వరూ అందుకోలేని స్థానం సంపాదించుకొన్నారు .

వచన కవిత్వమైనా ,సినీ గేయ మైనా,తనదైన ముద్ర వేసుకుంటూ ముందుకు సాగిన కళా తపస్వి. డా: సి.నా.రె. తెలుగు నుడికారాన్ని ,అక్షరాన్ని ఏలుబడిగా చేసుకొని జగత్తు అంతా వ్యాపించిన కవితా తపస్వి .కవిత్వం నా మాతృభాష ,నా శ్వాస అంటూ

కవితే చిరునామాగా జీవించిన కవితా పండితుడు. సామాన్య ప్రేక్షకుడిని ఆకట్టుకునేలా సాహితీసృజన చేసి తన కలంతో వెండితెరపై బంగారం సంతకం చేసిన సాహితీ శిఖరం .అనుభవాల మూట తెలంగాణ ఆణిముత్యం.ప్రాచీన సాహిత్యం నుంచి ఆధునిక సాహిత్యము వరకు ఏ రచన అయినా అలవోకగా చేసి తెలుగు సాహితీ క్షేత్రంలో సుస్థిర స్థానం అందుకున్న కవిత్వ వైతాళికుడు సింగిరెడ్డి నారాయణరెడ్డి గారు ..అత్యుత్తమ భావజాలాన్ని ,అలతి పదాలతో అందించిన ఆయన పాటలు నవపారిజాతాలు రసరమ్య గానాలు. సినారె గారి విశిష్టత కావ్యము ప్రపంచపదులు.ప్రపంచ పదులు రూపం దృష్ట్యా 5 పాదాలతో సాగిపోతుంది. నిర్దిష్ట గేయ గతిలో సాగిపోయే మాత్రాఛందస్సులో చేసిన వైవిధ్యమైన రచన. సమానమైన ఉపమాన నిరూపణ తో రచించబడినది ప్రపంచపదులు. ప్రకృతిలోని ప్రతి వస్తువును కూడా ఆయన రచనలో భాగంగా చేస్తూ సమానమైన పోలికతో వర్ణించారు. ప్రపంచపదులు అంటే విస్తరించి చెప్పడము, ప్రవచించి చెప్పడం అనే అర్థాలు వస్తాయి. "ప్ర"అనే ఒక ఉపసర్గకు విశేషం అని అర్థము. విశేషమైన పంచ పదులుగా ప్రపంచ పదులని చెప్పవచ్చు ..మారే విలువలకు దారి మలుపులు గా ప్రపంచపదులు చెప్పవచ్చు అని ఆచార్య డా॥ గోపి గారు ముందుమాటలో అభిప్రాయపడ్డారు.

**" ఈ చెట్టు ని చూసిన మరుక్షణం ఆ మట్టిని కాస్త తలుచుకో**

**ఈ గట్టు చేరిన మరు నిమిషం ఆ ఉట్టి ని కాస్త తలుచుకో**

**నువ్వు ఎంత ఎత్తులో ఉన్న జన్మించిన సంచిని మరవకు**

**ఈ మేడను ఎక్కిన మరు నిముషం ఆ మెట్లను కాస్త తలుచుకో**

**ఈగద్దె ను ఏలిన మరు నిమిషం ఆ సుద్దులను తలుచుకో "**

మట్టి నుంచి నువ్వు పుట్టిన విషయాన్ని ఎదిగిన తర్వాత మర్చిపోకు. ఒడ్డుకు చేరిన తర్వాత నువ్వు ఎక్కి వచ్చిన పడవను మరువకు. నీవు ఎంత ఎత్తుకు ఎదిగినా నీవు జన్మించిన తల్లిని మరువకు. మేడ ఎక్కిన తర్వాత , ఆ మేడకు చేర్చిన మెట్లను మరువకు. రాజకీయంగా ఎంత ఎత్తుకు ఎదిగినా స్థాయికి తెచ్చిన ఆ పలుకులని మరువకు అని సినారె గారు తెలిపారు.

**"జరిగిపోయిన కాలమెప్పుడు తిరిగిరాదని తెలిసినా**

**జారిపోయిన తార నింగికి చేరలేదని తెలిసినా**

**మంచు కమ్మిన బుర్రలను విదిలించుకొని పోరెందుకో**

**ఎండిపోయిన ఆకు కొమ్మకు ఉండలేదని తెలిసినా**

**ఆగిపోయిన శ్వాస ముందుకు సాగిపోదని తెలిసినా....** మనిషి ఆశ తీరదని సినారె పలికారు. సమాజంలో మంచి ప్రవర్తనతో మారాలనుకునేవారికి దారి మలుపులుగా ప్రపంచ పదులు అని చెప్పవచ్చు.

సినారే తెలుగు గజళ్ళు. ఉర్దూ సాహిత్యం లో ప్రసిద్ధ కవితా ప్రక్రియ గజల్. ఆ ప్రక్రియలో మత్లా ను పల్లవి మక్తా ను చరణాలు గాను తహల్లుస్ ను కవి నామము గానూ కాఫియ,రధిఫ్ లను అంత్యప్రాసలుగా గ్రహించి తెలుగులో ఎన్నో గజల్ లను సినారే వ్రాసారు.సినారె తెలుగు గజల్స్ లో ప్రధాన వస్తువులు సామాజికము. సందేశం మానవీయం. సినారె గారు రాసిన ఒక గజల్

**" నన్ను నేనే పాటగా పలికించు కుంటాను**

**మిన్నులను నా ముంగిటికి పిలిపించుకుంటాను.**

**!!నన్ను!!**

**ఎన్ని కోట్లున్నాయి నీకని, ఏమిటా ప్రశ్న**

**ఉన్న నిధి ఒక స్నేహమని ప్రకటించుకుంటాను.**

**!!నన్ను!!**

**అదుపుతప్పే ఆశలను మొదలంటూ తుంచేసి**

**ఆత్మతృప్తి నిండుగా పండించుకుంటాను. !!నన్ను!!**

**ప్రాణ తంత్రులను మీటగలిగే పలుకు వినబడితే**

**పారవశ్యపు అంచులను చుంబించుకుంటాను.!!**

**నన్ను!!**

**ఇహ పరాలను మేళవించే దిక్కులెదురైతే**

**అహంకారం సమస్తం అర్పించుకుంటున్నాను.**

**!!నన్ను!!**

**అసలు అంతం..ఓ సినారె ఆపలేరెవ్వరూ**

**ముసలి వయసున పసితనం ముద్రించుకుంటాను**

**!నన్ను!**

అంటూ తనకు తానే ఒక పాటగా చేసుకుంటూ నింగినే తన వద్దకు రప్పించుకుంటానంటాడు.ఎన్ని నిధులున్నా స్నేహమే అన్నిటికన్నా మిన్న అని చాటి చెప్పాడు. ప్రేమకు, తాత్వికతకు చిహ్నంగా ఉన్న గజళ్ళను తన కవితా వస్తువుగా ఎంచుకొని మనల్ని కొత్త అనుభూతులకు తీసుకెళ్లే ప్రయత్నం లో కృతకృత్యులయ్యారు.

డాక్టర్ సినారె గారు రాసిన మరొక అద్భుతమైన ఆవిష్కరణ "మందార మకరందాలు". సినారె గారు సుమధురంగా వ్యాఖ్యానించిన పోతన భాగవతం పద్యరత్నాలను "మందార మకరందాలు" అనే పేరుతో 1983లో జి కుమారస్వామి రెడ్డి గారు కార్య నిర్వహణ అధికారి గా ఉన్నప్పుడు తిరుమల తిరుపతి దేవస్థానము ముద్రించింది .మందార మకరందాలు అనే పదగుంఫనం చెవుల పడగానే తెలుగువారికి వెంబడే స్పురణకు వచ్చేది పోతన మహాకవి వ్రాసిన సుప్రసిద్ధ పద్యం మందార మకరంద మాధుర్యమున దేలు మధుపమ్ము వంటి సుప్రసిద్ధ పద్యాలను తెలుగు నాలికలపై తరతరాలుగా నలిగి నలిగి నానుడులుగా మారిన కవితలను మరికొన్నింటిని ఏర్చి కూర్చి ఆద్యతనాంధ్ర కవితా ప్రపంచంలో గేయ వాఙ్మయ సింధువుగా సుకుమార,సుందర,సాహితి స్రష్టగా రమణీయార్థ మాధురి మంత్రద్రష్టగా, సుగృహీత నామదేయులైన ఆచార్య శ్రీ నారాయణ రెడ్డి గారు ఈ గ్రంథాన్ని రచించారు భాగవతంలోని కనీసం ఒక పద్యం అయినా నోటికి రాని తెలుగు వాడు ఉండడు ఇంతటి ప్రజాదరణ పొందిన పోతన కవిత్వంలోని సుప్రసిద్ధ పద్యాలను ఎన్నిక చేసి మందారాల వంటి మహనీయమైన ఆ పద్యాలలోని మకరంద మాధుర్యముని పఠితులకు చవి చూపించి మురిపించేలా మనోజ్ఞమైన వ్యాఖ్యానాన్ని మధుర కవులు డాక్టర్ సి నారాయణ రెడ్డి గారు వ్రాయడం బంగారానికి తావి కల్పించడం వంటిదని చెప్పవచ్చు. డాక్టర్ సి నారాయణ రెడ్డి గారు భాగవత ప్రాశస్త్యాన్ని, పోతన వ్యక్తిత్వాన్ని ,కవితా మాధుర్యాన్నీ వ్యక్తీకరించే కమ్మని పద్యాలను ఇందులో ఎన్నుకున్నారు. భాగవత పద్యముల చుట్టు పరిమళించే తాత్విక సౌరభాల్ని రచనల్లో అంతస్సూత్రంగా అందగించుకున్న కళా సామ్రాజ్యాన్ని సరళ సుందరమైన శైలిలో రచించారు. మందార మకరందాలు చదివే పఠితకు ఈ వ్యాఖ్యానం చదువుతున్నట్టు అనిపించదు. నారాయణరెడ్డి గారు మధురంగా మాట్లాడుతున్నట్టు ఉంటుంది. పోతన కవితా తత్వాన్ని సాక్షాత్కరించే పద్ధతితో పాటు కొన్ని పద్యాలలో భావాలను కొత్త చూపుతోసమీక్షించి ప్రత్యేకతను ప్రదర్శించారు. పోతన ప్రజాకవిగా ప్రఖ్యాతి పొందటానికి కారణమైన ఆయువు పట్టులను కూడా ఎత్తి చూపించారు.

"పలికెడిది భాగవతమట

పలికించు విభుండు రామ భద్రుండట నే పలికిన భవహర మగునట

పలికెద వేరొండు గాథ పలుకగనేలా"

భక్త పోతన విష్ణు కథ వ్రాయాలని కుతూహలంతో ఉన్నాడు కల లాంటి మెలకువతో ఉన్న పోతనకు కళ్ళెదుట నిలిచినాడు రాముడు. భాగవతం తెలుగులో చెప్తే భవబంధాలు తెగిపోతాయి అని ఆనతిచ్చాడు. దొరికిన కథ ఏమో మహాభాగవతం.ఫలమేమో భవబంధ విమోచనము.. విప్పారిన కన్నులతో మెరుగుపడ్డ మనసుతో అనుకున్నాడు. పలికెడిది భాగవతమట పలికించు శక్తి స్వీయము కాదు దివ్యం అని పలికితే కలిగే ఫలం తాను మొట్టమొదట ఆశించిన కైవల్యం అని ఇంతకు మించిన సాఫల్యం ఏముంది. అంతకుమించిన కథ వేరేముంది అని పోతన భాగవతం వ్రాయ సంకల్పించాడు .పండి మగ్గిన వ్యాస భాగవత ఫలం పోతన వంటి తెలుగువాళ్లకు లభించడం దైవనియోగం మన అందరి అదృష్టం అని చెప్పవచ్చు.

కమనీయమైన ఈ భాగవత పద్యం లో సినారె గారు అద్భుతంగా వ్యాఖ్యానం రాశారు. ఇది మనందరి పూర్వజన్మసుకృతంగా భావించవచ్చు .

''విశ్వంభర''కావ్యము భారతీయ జ్ఞానపీఠ పురస్కారం పొందిన గొప్ప కావ్యం .సమగ్ర వచన కావ్యముగా

తెలుగు సాహిత్యమున కీర్తిపతాకగ నిలిచాడు .ఈ కావ్యానికి నాయకుడు మానవుడు ,రంగస్థలం విశాల విశ్వంభర .!ఇతివృత్తం,తేదీలతో నిమిత్తంలేని పేర్లతో అగత్యంలేని మనిషి కథ.ఈ కథకు నేపథ్యం ప్రకృతి.మనిషి ధరించే వివిధ భూమికలకు మూలధాతువులు మనశ్శక్తులు.అలెగ్జాండర్ ,క్రీస్తు, అశోకుడు, సోక్రటీస్ ,బుద్ధుడు, లింకన్, లెనిన్ మార్క్స్, గాంధీ ఇలా ఇలా ఎన్నెన్ని రూపాలో మనిషికి. కామం, క్రోధం ,లోభం, మదం, ఆత్మశోధనం ప్రకృతిశక్తుల వశీకరణం ఇలా ఇలా ఎన్నెన్ని విభిన్న ప్రవృత్తుల్లో మనిషికి .ఆదిమదశ నుంచీ ఆధునికదశ వరకు మనిషి చేసిన ప్రస్థానాలు ఈ కావ్యంలోని ప్రకరణాలు. మనిషి సాధన త్రిముఖం– కళాత్మకం, వైజ్ఞానికం, ఆధ్యాత్మికం .ఈ సాధనలో అడుగడుగునా ఎదురుదెబ్బలు.క్షతుడైనా మనిషి తిరోగతుడు కాలేదు విశ్వంభర కావ్యము సినారె కావ్యరచనకు పూర్వమే గీసుకున్న రేఖాచిత్రము .విశ్వమానవేతిహాసాన్ని, అవధులు లేని మనిషి మానసిక భావాలను అవగాహన చేసుకునే హృదయాలకు ఈ కావ్యం బాగా అర్థమవు తుంది.కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు పొందిన "మంటలు మానవుడు" మాత్రాఛందస్సులో వచన కవులకు మార్గదర్శిగా నిలిచింది. సమాజాన్ని భిన్న కోణాల్లో దర్శించి ఆయా సంఘటనలను ప్రతీకాత్మకంగా తన రచనల్లోనే చిత్రించి మనకు అందించారు.

'కర్పూర వసంత రాయలు 1957 లో వచ్చిన ఒక కథాత్మక గేయ కావ్యం. కుమారగిరి రాజు "లకుమ "నాట్యానికి ఆమె లావణ్యానికి దాసుడు అవుతాడు.రాజ్యాన్ని రాణిని కూడా విస్మరిస్తాడు. రాజ్య పరిరక్షణార్థం రాణి లకుమ దగ్గరికి వెళ్లి రాజ్యాన్ని రక్షించమని అర్థిస్తుం ది.". లకుమ'' ప్రాణత్యాగంతో కావ్యం ముగుస్తుంది.రెడ్డి రాజుల చరిత్రకు ప్రాణం పోసిన మల్లంపల్లి సోమశేఖర శర్మకు ఈ కావ్యాన్ని అంకితం ఇచ్చారు.

సినారె సేవలకు గాను "సాహిత్య అకాడమీ అవార్డు (1973), పద్మ శ్రీ (1977),కళాప్రపూర్ణ (1978),జ్ఞానపీఠ్ అవార్డు (1988), పద్మభూషణ్ (1992),సాహిత్య అకాడెమీ ఫెలోషిప్ (2014) అవార్డ్ లు దక్కాయి.శోభ పత్రికకు సంపాదకత్వం వహించాడు .అనారోగ్యంతో నారాయణరెడ్డి,గారు హైదరాబాద్ లోని కేర్ ఆస్పత్రి లో చికిత్స పొందుతూ 2017, జూన్ 12 సోమవారం తుదిశ్వాస విడిచారు..ఐదు దశాబ్దాల వరకు తెలుగు సాహితీ నేలకు ఎనలేని సేవ చేసి తన ఆఖరి శ్వాస వరకు కలం చేత్తో పట్టుకున్న వనమాలి .తోటలో కవిరాజు తరలిపోయే నేడు...అంటూ

ఒక సాహితీ శిఖరం నేల రాలిపోయింది.

తెలుగు పాట మూగబోయింది. అయినా ఆయన సృష్టించిన కావ్యాలతో అజరామరముగా చరితలో నిలిచిపోయారుఆయన మన మధ్య లేకున్నా ఆయన రాసినపాటలు,గేయాలు ,గజల్స్, వ్యాసాలు, ఇలా ఎన్నో మనల్ని స్పృశిస్తూనే ఉన్నాయి.సినా రె గారి కావ్యాలను చదివినా విన్నా కూడా శతకోటి మల్లెల సువాసన ఇస్తుంది అనడంలోఎలాంటి అతిశయోక్తి లేదు.



– సునీత బండారు
9440671530

# సాహితీ పత్రికను నడపడం సాహసమే- డా॥ కె.వి.రమణాచారి

నేటి పరిస్థితులలో సాహితీపత్రికను నడపటం సాహసమేనని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు డా॥కె.వి. రమణాచారి ఉద్ఘాటించారు. ఈనెల 10న శ్రీ త్యాగరాయ గానసభలోని కళాసుబ్బా రావు కళావేదికపై సాహితీకిరణం మాసపత్రిక 13వ వార్షికోత్సవ సభలో ముఖ్యఅతిథిగా పాల్గొని ఉద్ఘాటించారు. డా॥రమణ మాట్లాడుతూ 13 సంవత్సరాలుగా సాహిత్య పత్రికను నిరాటంకంగా నడుపుతున్న సుబ్బారావుకున్న సాహితీ పిపాస ఆ పత్రికకు ప్రాణవాయువుగా పనిచేస్తోందని అన్నారు. సాహితీ కిరణం గౌరవ సంపాదకులు గుదిబండి వెంకటరెడ్డి అధ్యక్షత వహించిన సభలో సాహితీకిరణం సంపాదకులు పొత్తూరి సుబ్బారావు ప్రారంభ ఉపన్యాసంలో పత్రిక నిర్వహణ సాధకబాధకాలను పేర్కొంటూ సాహితీకిరణంలో అన్ని ప్రక్రియలకు స్థానం కల్పించబడుతున్నదని, ఔత్సాహిక కవులు రచయి తలను ప్రోత్సహిస్తున్నదని ప్రతి యేటా అనేక ఇతర సంస్థలతో కలిసి కవితల పోటీలు, కథలపోటీలు నిర్వహిస్తున్నదని తెలియ జేశారు. సాహితీకిరణం సలహాదారులు పెద్దూరి వెంకటదాసు సభకు స్వాగతం పలుకగా నేటినిజం సంపాదకులు బైసదేవదాసు శుభాకాంక్షలు అందజేశారు.

పింగళి కమలాకేసరి నెలకొల్పిన డా॥ పింగళి జగన్నాథరావు స్మారక సాహిత్య పురస్కారాన్ని చారిత్రక నవలా చక్రవర్తి ఆచార్య ముదిగొండ శివప్రసాద్ కి అందజేశారు. ముదిగొండ శివప్రసాద్ తనకు చేసిన సత్కారానికి స్పందిస్తూ ఈ రోజుల్లో ఒక సాహిత్య పత్రికను నడపటం ఎంతో గొప్పవిషయమని అన్నారు. పింగళి జగన్నాథరావుతో తనకున్న అనుబంధాన్ని మననం చేసుకున్నారు.

సిరిగాద శంకర్ నెలకొల్పిన సిరిగాద బాలమ్మ స్మారక సాహిత్య పురస్కారాన్ని అనాదిగా సాహితీకిరణంలో సీనియర్ కాలమ్‌ను నిర్వహిస్తున్న డా॥గురజాడ శోభాపేరిందేవికి, జన్నాభట్ల నరసింహ ప్రసాద్ నెలకొల్పిన జెన్నాభట్ల నరసింహ శాస్త్రి స్మారక సాహిత్య పురస్కారాన్ని సాహితీకిరణంలో సాహితీ పదకిరణం నిర్వహిస్తున్న కన్నోజు లక్ష్మీకాంతంకి అందజేశారు. ఈ సందర్భంగా సాహితీకిరణం పుష్కరోత్సవ పుర స్కారాలను డా॥పి. లలితవాణి (సాహిత్యం), యమ్. మధుసూదన్ (సేవారంగం), కె.హైమవతి (విద్యారంగం), టి.జి.యతీంద్ర ప్రవణాచార్య (పంచాంగకర్త), సి.హెచ్. రామకృష్ణారావు (పాత్రికేయం) లకు అందజేశారు.

యం.బాలగంగాధరయ్య నెలకొల్పిన యం.బాలనాగయ్య స్మారక సాహిత్య జాతీయస్థాయి కవితలపోటీలో గెలుపొం దిన డి.స్వర్ణశైలజ (విశాఖపట్టణం), యం.విజయకుమార్ (సత్తెనపల్లి), అవ్వారు శ్రీధర్‌బాబు (నెల్లూరు), బి.కళాగోపాల్ (నిజామాబాద్), ఎస్.ఆర్.పృథ్వి (రాజ మహేంద్రవరం)లు బహుమతి అందుకు న్నారు. ఈ సందర్భంగా కన్నోజు లక్ష్మీ కాంతం, జన్నాభట్ల నరసింహప్రసాద్‌లు సభలో ప్రసంగించారు.

కార్యక్రమానికి ముందు 'శివపాద మంజరి నాట్య మండలి' వారిచే నాట్య గురువు చికీర్ష శైలూషి ఆధ్వర్యంలో నిర్వహించబడి నృత్యవిభావరిలో యస్.వల్లి కృష్ణ యశశ్విని, జి.అంజని, వి.వి.ఎల్.గీతాశ్రీ, కె.చాతుర్య, ఎస్.ఎస్.డి. సంయుక్త, శ్రీ శర్వాణి, యం.సాయిశ్రీ, బి.విష్ణుప్రియ, బి.హేమహర్షిత, యన్.భూమిక పాల్గొన్నారు.



ఈనెల 9న శ్రీ త్యాగరాయ గానసభలోని కళాసుబ్బా రావు కళావేదికపై సాహితీకిరణం మాసపత్రిక 13వ వార్షికోత్సవ సభలో పురస్కార గ్రహీతలతో అతిథులు బాల గంగాధరయ్య, బైసదేవదాసు. పొత్తూరి సుబ్బారావు, డా॥కె.వి.రమణాచారి, గుదిబండి వెంకటరెడ్డి, పెద్దూరి వెంకటదాసు తదితరులు.



పురస్కార గ్రహీత ఆచార్య ముదిగొండ శివప్రసాద్‌ను సత్కరిస్తున్న డా॥కె.వి.రమణాచారి.



సాహితీ కిరణం సంపాదకులు పొత్తూరి సుబ్బారావును సత్కరిస్తున్న బైస దేవదాసు, డా॥కె.వి.రమణాచారి, గుదిబండి

## ధన్యజీవి

రెండక్షరాల పేరులో
రెండింతల విస్ఫోతనం
ప్రపంచ బాధే తనదిగా
చేసుకొని రగిలించిన జ్వాల
ఒక శ్రీ విప్లవం
ఒక శ్రీ అభ్యుదయం!!

కార్మికుల కళ్యాణం కోసం
శ్రామికుల సౌభాగ్యం కోసం
అనాథలు అభాగ్యుల కోసం
కత్తికంటే పదునైన కలంతో
అక్షర బాణాలు ఎక్కుపెట్టి
సామాన్య మానవుని పక్షాన
నిలబడి ఎదిరించిన మహాకవి!!

అభ్యుదయ పథంలో చరిస్తూ
ఛందస్సుల అడ్డంకులు దాటి
ప్రజల మనసును
సామాన్యుని జీవనాన్ని
అర్థం చేసుకుని
వాళ్ళ జీవితాల్లో వెలుగులు
చూడాలని ఆశించి
వచన కవితా మార్గంలో
నడిచిన విప్లవ జ్వాల!!

తెలుగు సాహిత్యంలో
తనదైన ముద్ర వేసి
అందరి మదిలో నిలిచిన
చిరంజీవి ధన్యజీవి!!



–డా.చీదెళ్ళ సీతాలక్ష్మి
9490367383

## కవిని నేను... కాస్త జాగ్రత్త..!

కవిని నేను...
కలం పట్టానంటే...
గుట్టంతా రట్టు చేస్తాను..!

కవిని నేను...
కలం పట్టానంటే...
కడుపులో పేగుల్ని లెక్కపెడతాను..!

కవిని నేను...
కలం పట్టానంటే...
కలంతోనే శతృవుల్ని ఖతం చేస్తాను..!

కవిని నేను...
కలం పట్టానంటే...
మానవత్వాన్ని మరచినవారికి...
మౌనంగా మరణశాసనం లిఖిస్తాను..!

కవిని నేను...
కలం పట్టానంటే...
సమాజంలో రుగ్మతలను సమాధి చేస్తాను..!

కవిని నేను...
కలం పట్టానంటే...
కమ్మనికలలు కంటాను...
పచ్చదనాన్ని ప్రేమిస్తాను...
మోడువారిన బ్రతుకుల్ని చిగురింప జేస్తాను..!

కవిని నేను...
కలం పట్టానంటే...
కస్సుబుస్సు మనను...
కాటువేయను కడుపుమీద కొట్టను కానీ
పంతానికి వస్తే మాత్రం అక్షరాలతో
అంతంచేస్తాను..!



–పోలయ్య కూకట్లపల్లి
9110784502

## నాటి..నేటి..పల్లె

కోడిపుంజుల కూతలతో..
పల్లె తల్లులంత మేల్కొనెను..!
పనులన్నీ చక చక చేసుకొని..
వందరోజుల పనికెలుతుండెను..!!

ఎండాకాలమున పల్లెల్లో..
ఏమి పనులు లేకుంటుండెను..!
ఏదో ఒక పని చేస్తేనే...
కడుపు నిండునని కాముకెల్లెను...!!

నాటి రోజులన్ని మారిపోయి..
గడ్డురోజుల కాలమొచ్చెను..!
ఏ కాలమచ్చినేమున్నది..
కాలుష్యమె అంత కమ్ముకొనెను..!!

పాతరోజులె పదిలంగుండె.
మదిలోన గుర్తొచ్చి బరువాయె..!
ఎక్కడ ఏ పంట వేసినా..
పుట్లకొద్ది ధాన్య రాశులాయె..!!



–పసుల.శంకర్
9542181301

## నైరుతి రాక

కాల చక్ర భ్రమన గమనాలు
రుతురాగాల పునరాగమనాలు
పశ్చిమంలోంచి శీతల గాలులు
వేసవి మంటల్ని తరిమే చినుకులు
ఉక్కపోతలకు సాదర వీడ్కోలు !

ఉరుములు మెరుపుల లీలలు
రైతుల కళ్ళల్లో ఆనంద బిందువులు
పొడి మట్టి తడి కోసం ఆరాటాలు
విత్తులో దాగిన జీవం మెల్కొలుపులు
నాగలి ఎద్దు ఎగుసం ముస్తాబులు !

వడగళ్ల భీభత్సాలకే విడాకులు
ఎండిన కొమ్మలు చిగురించే నవ్వులు
తొలకరి జల్లులు చిమ్మే మట్టి వాసనలు
నెర్రెల బారిన చెరువుల దాహాలు
పని ముట్లు ముస్తాబైన పల్లెలు !

రుతుపవనాలే సంతోష వరాలు
పచ్చదనాన ప్రసవ ఆరాటాలు
వాన చినుకులే ధాన్య రాసులు
మత్తడి దునికిన ఊరి చెరువులు
గర్భిణులైనట్లు గుమ్మల కలలు !



– మధుపాళీ
9949700037

## నేనెవరో తెలుసా !

నీతిగా బ్రతకాలి
అనుకున్న నేను
అవినీతి పనులకు
అలవాటు పడ్డాను
ధర్మంగా బ్రతకాలి
అనుకున్న నేను
అధర్మాన్ని
అలవర్చు కుంటున్నాను
లక్షణంగా బ్రతకడానికి
లంచాలు తీసుకుంటున్నా
దర్జాగా ఉండాలి
అనుకుంటున్న నేను
దౌర్జన్య పనులను చేస్తున్నాను
ఉన్నట్టుగానే ఉంటాను
ఊసరవెల్లిగా........
మారుతుంటాను....
కల్లబొల్లి కబుర్లు నల్లి
కాలం గడుపుతుంటాను
గొంతులు కోయడం
ప్రాణాలను తీయను
నాలోనూ మానవత్వం ఉంది
అందుకే కదా...!!
ఈ లోకంలో నేను
న్యాయంగా బ్రతకాలి
అనుకుంటే
న్యాయదేవత ఏమో కళ్ళకు
నల్ల వస్త్రాలు కట్టుకుంది మరి
ఈ లోకంలోని నరికేశారుల మధ్య
అవును నేను ఇలాగే బతకాలి
మోసాలతో మీసాలు
మెలి వేసే వానికి
హారతులు లేత్తుతున్నారు జనం
వంచకులకు తలవంచి
మంచితనానికి
గోరీ కడుతున్నారు.......

ఈ లోకంలో ఇలాగే
బ్రతుకుతున్నారు కొందరు.
రైతులారా ఆత్మహత్యలు వద్దు
ఇలాగా కూడా బ్రతకొచ్చు......
ప్రేమికులారా...!
ప్రేమ విఫలమైతే
ఆత్మహత్యలు వద్దు !
అప్పుల బాధతో కృంగిపోయినా
ఆత్మహత్యలు వద్దు !
మీరు ఆత్మహత్యలు చేసుకుంటే.....
ఉన్న వాళ్లకు ఉరి
మనిషి బ్రతికి సాధించాలి
చావు పరిష్కారం కాదు.?
నన్ను నమ్ముకోండి!
హాయిగా బతకండి!!
రాజకీయ నాయకులు సైతం
నన్ను ఆశ్రయిస్తారు
పోషిస్తారు,ఆదరిస్తారు.
నల్లకోటు ధరించే లాయర్లకు
నేనంటే ఎంతో ఇష్టం
న్యాయానికి నేనంటే గిట్టదు
న్యాయం తో స్నేహం
నాకు పట్టదు
న్యాయానికి నేను
పక్కలో బల్లెంలాంటి దాన్ని.....
నేనెవరినో నా నిజ రూపం
మీకు తెలిసిపోయే ఉంటుంది.
ప్రతి మనిషిలో ఏదో రూపంలో
నేను ఆవరించి ఉంటాను.
న్యాయానికి బద్ధ శత్రువును
అక్రమాన్ని అన్యాయాన్ని !!



– రస స్రవంతి –9290215858
కావ్యసుధ – 9247313488

## చైతన్య గీతం

నా మదిలో పల్లవించే మధుర గానం
మానస జీవన సంగీతం
మరణం మూడు అడుగుల దూరంలో ముంచెత్తబోతు
మృత్యు రాగం ఆలపిస్తుంటే
ఇంకా రెండు అడుగులు మిగిలే ఉన్నాయి
అనే స్థైర్యంతో సానుకూల దృక్పథంతో
ఆ అంతిమ సమయాన్ని
ఆదర్శప్రాయంగా తీర్చిదిద్ది కొని
దుఃఖ ఛాయలను దరిరానీక , కన్నీరుగా కరగక
చెదరని చిరునవ్వుతో
ధైర్యాన్ని ధర్మాన్ని
వీడక
మమతల దారుల్లో
మానవత్వపు పూలు పూయిస్తూ
నీవు వేసే ఆ రెండు అడుగులు
శిలా శాసనాలు గా నిలబడుతాయి.
నిన్ను నిలబెడతాయి కలకాలం కాలం గుండెల్లో
ఇదే కర్మ సిద్ధాంతపు ఆవలి తీరం
మరెందరికో మార్గ నిర్దేశం
మనోదౌర్బల్యంతో
జీవితాన్ని నిస్సారం చేసుకొని ఆత్మాహుతి వైపు అడుగులు వేస్తూ
చీకటినే చిరునామాగా చేసుకున్న వారికి
వెలుగుల దీపం
ఈ చైతన్య గీతం
గాయపు గాథలను గెలుపు గేయాలు గా మార్చే
సమర పాఠం
నేను అనుసరించే
అద్వైత మంత్రం ఈ బ్రతుకు సూత్రం
సర్వేజనా సుఖినోభవంతు



–కళతాటికొండ
సెల్: 9989891558

## భావ ప్రకటన

కొండంత
మహావిష్ణువు ను కుదించి
వామనుడ్ని చేస్తుంది.

వేలెడంత వామనుడ్ని
విస్తరించి
విశ్వరూపం చూపిస్తుంది.



–మాధవీసనారా,
8639491246


ఆహ్వానం

**శ్రీ కిరణ్ సాంస్కృతిక సమాఖ్య**
మరియు
ప్రపంచ రికార్డులలో స్థానం పొందిన ఆడిటోరియం
**శ్రీ త్యాగరాయ గానసభ సంయుక్త ఆధ్వర్యంలో**
శ్రీ కళాసుబ్బారావు కళావేదిక, చిక్కడపల్లి, హైదరాబాద్.
తేది: 19-06-2022 ఆదివారం, సమయం సా॥ 6.00 గం॥లకు



" శ్రీమతి ఏకావద్మ స్మారక పురస్కార ప్రదానోత్సవ సభ "

| | | |
|---|---|---|
| ముఖ్య అతిథి | : | ఫ్రొ॥డా॥ డి.ఓబుల్ రెడ్డి, Ph.D. విశ్రాంత - ప్రొఫెసర్, ఉస్మానియా విశ్వవిద్యాలయము. |
| సభాధ్యక్షులు | : | డా॥ ప్రతాప వున్నయ్య విశ్రాంత - అడిషనల్ డైరెక్టర్, యానిమల్ హస్బెండరి. |
| విశిష్ట అతిథి | : | శ్రీ కళా వి.ఎస్. జనార్ధన్ మూర్తి అధ్యక్షులు - శ్రీ త్యాగరాయ గానసభ |
| గౌరవ అతిథి | : | శ్రీ బైస దేవదాసు, సంపాదకులు, నేటినిజం. |
| పురస్కార గ్రహీత | : | డా॥ శ్రీమతి శరణ్య, M.B.B.S., M.D., జనరల్ ఫిజిషియన్. |
| పురస్కార ప్రదాత | : | శ్రీ ఏకానాగరాజు రామ మోహన రావు, ప్రొప్రైటర్ - పద్మఆఫ్సెట్స్ |
| వందన సమర్పణ | : | శ్రీమతి ఏకా వేంకట సంవర్ధని |

శ్రీ కళా వి.ఎస్. జనార్ధన్ మూర్తి, అధ్యక్షులు-శ్రీ త్యాగరాయ గానసభ
శ్రీమతి కళా శారద, ప్రధాన కార్యదర్శి -శ్రీ త్యాగరాయ గానసభ



లంకా వెంకట సుబ్రహ్మణ్యం, అధ్యక్షులు, శ్రీమతి భాను, కార్యదర్శి
**శ్రీ కిరణ్ సాంస్కృతిక సమాఖ్య**
ప్లాట్ నెం. 308, శ్రీ మణికంఠ అపార్ట్‌మెంట్స్, కళ్యాణ్ నగర్, ఈస్టు ఆనంద్ బాగ్, మల్కాజ్‌గిరి, హైదరాబాద్-500 047. సెల్: 94404 48650

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక, దర్పణం సాహిత్య వేదిక సంయుక్తంగా ప్రతిరోజూ ఒక అంశం ఇచ్చి కవిత్వ రచన చేయిస్తున్నాయి. కవిత్వాన్ని నిరంతరం సాధన చేయిస్తున్నాయి. కవులు రాసిన పద్యాలు, వచన కవితలు, గేయాలను విశ్లేషించి; మెరుగు పరచుకోవడానికి ప్రతిరోజూ సూచనలు, సలహాలు ఇవ్వడం జరుగుతోంది. ఈ దైనందిన కార్యక్రమంలో భాగంగా 557వ రోజు **'పానీ పూరీ'** అనే అంశంపై పలువురుకవులు తమ కవితలను పంచుకున్నారు. **'పానీ పూరీ'** అనే అంశంపై వచ్చిన కొన్ని కవితలను 'నేటి నిజం' పాఠకుల కోసం ప్రత్యేకంగా...



మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక &
దర్పణం సాహిత్య వేదిక వాట్సాప్ సమూహం
ఏకాంశ కవిత్వం నిర్వహణ:
**-డాక్టర్ రాయారావు సూర్యప్రకాశ్ రావు, 9441046839**

## జంట పదాలు

పానీ కోసం పాట్లు ఒకవైపు
పూరితో పానీ పట్టు ఇంకోవైపు
ఒక్కసారే నోరు తెరిచి
నోటి కుహరంలో పెట్టేసి
మింగుతుంటే
మసాలా ఘాటు
ఉక్కిరిబిక్కిరి ఒక్కోసారి!!.
చిన్న పాత్రలో ఉల్లి
రంధ్రమయం గుండ్రని పూరీ
బఠాణా దానిలో దూర్చి
పానీలో పూరీ ముంచి
ఒక్కొక్కరికి ఒక్కోటి వేస్తుంటే
నోట్లో మెల్లిగా జారవిడుస్తుంటే
ఆహా.. ఏమి రుచి!
లేదు శుచి
అయినా
తినని వారుండరు ఎవ్వరు!!.
కడుపునిండక పోయినా
కడు పసందు
అందరి మనసులకు విందు
గప్ చుప్ గా పొందు
ఆహా ఏమందు!!.
ఆహార భద్రత కడు ముఖ్యం
చేతులు పానీలో
ప్రమాదం ముంచేసు
పరిశుభ్రతే పరమావధి
రోడ్డు మీద ఆహారం
విషవలయాల సమరం
ఆరోగ్యమే మహాభాగ్యం!!.
పెద్ద చిన్న లేదు
కులమతాలు లేవు
లింగ భేదము లేదు
అందరినీ చేరదీసే మాయలాడి
ఆకర్షించి దరిచేర్చే నేస్తం
సమానత్వానికి పాఠం
పెళ్లిలో ప్రముఖ స్థానం
ప్రతి గల్లీలో దర్శనం
పానీ పూరీ జంట స్నేహితులు
ఒకరికి ఒకరు అనుబంధం
ఆదరించే జంట నేస్తాలు
స్వయం ఉపాధికి మార్గాలు!!.



**-డా. చీదెళ్ళ సీతాలక్ష్మి**

## ప్యారీ!

పానీ పూరీ కోరింది ప్యారీ!
"సాయంత్రం దాకా ఆగను "అంది!
మొన్ననే పెళ్లి-ఇవ్వాళ గిల్లికజ్జా!
భామ అలుక తీర్చ
"వినవే చెంచిత!చేసెద పూరీ!
పరెషాన్ చేయకు!"
అనుచు నరసింహస్వామి
నడుంబిగించి దూరె కిచెన్లో!
ఆలూబఠాణీ ఉడికించె
ఉప్పు కారం
చాట్ మసాలా
జీరా పొడిగుప్పించే!
చింతపండు గుజ్జు
ఉప్పు కారం
చాట్ మసాలా
కొత్తిమీర పుదీనా
గ్రైండర్ లో గిరగిర తిప్పె!
గోధుమ పిండి కొద్దిగ రవ్వ
సోడాఉప్పు కల్పి ఎంచక్కా
గభీగుభీ మర్దించే!
బుల్లి బుల్లి గుండ్రని పూరీలు
వేడివేడి నూనెలో సుయ్ సుయ్!
బుగ్గలా పొంగిన పూరీచూస్తూ
మధ్యలో వేలితో చేసే చిల్లి!
కూరను అందులో కూరి
పానీనీటిని పైన పోసె
"ఆరగింపుమా భార్యామణీ"
ఆయన రాగాలాపన
ముగియక ముందే
గుటుక్ గుటుక్ భామనోటిలో
ఐపూ అజా లేకుండా
ప్లేటెడు పానీపూరీ ఖతం!?
మిగిలింది ఒకేఒక్క పానీపూరీ
బిక్కమొహంతో బావ
చటుక్కున చురుగ్గా నోట్లోకి నెట్టే!.
ఇదేనండి పానీపూరీ కహానీ!
వంటవచ్చిన అబ్బాయిలు
జరభద్రం సుమండీ!
తయారీతో పాటు
గుటకాయస్వాహా చేయకుంటే
నోటిలో మిగిలేది కరక్కాయ!.

**-ఎ. రాజ్యశ్రీ**

## ఉరకలేస్తూ నిలిచిపోయి...

పానీ పూ
బండి చూడగానే
అడుగుల దిశ మారుతుంది
చిన్నపెద్దా తేడాలేక
గుటకలేస్తూ తింటారు
పెండ్లి పేరంటాలకు పిలుస్తారు
స్నాక్స్ బండార్ అంటారు
పానీ పూరీ చుట్టూ
మూగిపోతారు.
మూడు గంటలయ్యిందంటే
బండి ప్రత్యక్షం
ఉల్లిగడ్డ ఆలుకర్రి
మధ్యలో పెట్టి ఇస్తారు.
అది చూసి పిల్లలు
సరదాగా పిల్లలు
మనసు పెట్టి తింటారు.
ఎన్ని తిన్నా కడుపు నిండదు
ఏమిటో ఈ విచిత్రం
అదియే ఈ ప్రపంచం.



**-వి. సంధ్యారాణి**

## ఆహా! యేమిరుచీ!

ధారైపారు రసమ్ము చింతపులుసే తాదాత్మ్యమై త్రాగగా
నీరేజారు మసాలయుల్లిగల పానీపూరి సాయంత్రమున్
కారమ్మిర్చి బటానియుప్పు కలుపన్ కంఠమ్ములో జీవమై
సారమ్మే నవనాడులందు బలమున్ సౌఖ్యమ్మునానందమున్!!

ఆహా యేమిరుచీయన్ మనసుకాద్యంతమ్ము ప్రేమాత్మయై
స్వాహా చేయగనొక్కటొక్కటపుడే పన్నెండు లాగించగన్
స్నేహమ్మై యెదనిల్వగా రసన పానీపూరి సాంబారులన్
ద్రోహమ్ముగ్ కడుదూరమై యువత సందోహమ్ములో ప్రీతియే!!
దుమ్ముధూళియనగ దోసమేముండదు
వమ్ముజేయగబోరు వరలు రుచిని
తాను మెచ్చిన రంభ తనవి దీర్ఘగనంబ
నిష్టమైనయపుడు హింగు సమము
డ్రైనేజీ ప్రక్కన టీనేజీ నేస్తాలు
వలపు రసమునుకార పానిపూరి
నారగించుటనేడు కోరుచు తినిపించు
బయటి తిండ్ల జనము పరమప్రీతి.
స్నాక్సుచాటురుచులు సాయంత్రమున్నెటు
జోక్సు తనువులందు జోరుచురుకు
పావనమగుచారు పట్టినగుండ్లతో
పసను కల్గు రుచియె పానిపూరి.



**-మాదుగుల నారాయణమూర్తి**

## జిహ్వాకో రుచి

చేతిలో చిప్ప పెట్టి
వరసలో నిలబెట్టి
అమృతం పంచే
ఆది విష్ణువుని
తలపించే పానీ పూరీ
ఎంత కోటేశ్వరుడైనా
బండిముందు
నిలబడాల్సిందే మరి...
బుల్లిపూరి
బుస బుస పొంగి
బుడ బుడ పొగరణగ
బొక్క పెట్టి మధ్యలో
ముద్దుగా రగడ
ఆలుబఠాణీ
కూర కూరి
ఘుమ ఘుమ లాడే
మసాలా నీళ్లలో
ఒడుపుగా ముంచి
అలవోకగా చిప్పలో వేస్తే
అవురావురంటు
మనం ఒక్క సారే
నోట్లో ఉంచి
గప్పు చిప్పు గా గుటుక్కు
చాటుకోవాలి మన నిపుణత
గోల్ గప్పా
పానీ పూరీ
గప్ చిప్...
పేరేదైనా
పరవశ మొక్కటే.
కడుపు నింపు
కడుపుని శుభ్ర పరుచు
పానీపూరీ సేవనం
ఒక ఉల్లాసం
అదో అలవాటు
బండి చూస్తే చాలు
కాళ్లు మన మాట వినవు
తింటే అదో తృప్తి
తినకపోతే ఏదో వెలితి..



**- మోటూరి శాంతకుమారి**

## ఎక్కువ తింటే

పూరీ కాని పూరీ
పానీ పూరీ
పేరులోనే ఉంది
నోరూరించే ఝరి
లోపలంతా డొల్లగా
బయటేమో తెల్లగా
నోట్లో వేసుకుంటే గుటుక్కు మంటుంది
దొప్పలో పెడితే గప్ చుప్ గా తినేస్తారు
నోటిలో పడ్డ క్షణంకరిగిపోతుంది
అల్లరి చేయకుండా లోపలికి వెళ్ళి పోతుంది
పులుపుగా, ఉప్పగా
వగరుగా, ఘాటుగా
నాలుగు వీధుల కూడళ్లలో
వీధి చివర్లో
నాలుగు చక్రాల బండిని తోసుకుంటూ
మసక పడితే చాలు
వచ్చి చేరి పోతారు
జాగ్రత్త!
ఎక్కువ తింటే కడుపుకే చెడుపు.



**- కందుకూరి మనోహర్**

ఘాటైన మసాలా నీళ్లు ముంచి
పది మందికి పంచుతూ
మరపురాని మస్త్ చాట్.
రోడ్డు మీది చాట్ బండి
చూడ గానే లొట్టలు
గప్ చుప్ గా వెళ్లి
గబా గబా తినేసి వెళ్ళండి.
స్ట్రీట్ ఫుడ్ అని చీపుగా అనకు
చిన్న వ్యాపారుల ఆదాయ మార్గం
కొందరికి అది ఉపాధి
అందరికి ఆనందమది
స్వయం సమృద్ధికి సోపానం
స్వతంత్ర జీవనానికి ఆధారం.



**-జి. కొండల్ రావు**

## స్వయం ఉపాధి

గుటుకు గుటుకు మంటూ
ఒకటి వెనుక ఒకటి మింగు
నోటి లోన ఘాటు
అదో రుచి హాటు.
రకాలు రకాల రుచులు
ఎన్నో రకాల హంగులు
బఠాణితో ఉల్లి చేర్చి

## కుర్రకారుకు పసందు

పానీపూరీ..
ఆపేరు వింటేనే
పసందు కుర్రకారులందరికి
ఇక ఆ బండి దగ్గరికి వెళ్ళారా!
అసలు టైమేతెలియదు.
ఆ రుచి ఏమిటో గాని
ఎంతసేపైనా విసుగురాదు
నిలుచునేవుంటారు
బండిఎదురుగా
లొట్టలేసుకుంటూ...
మైమరచిపోతూ
చిన్న బకెట్ లో వున్నవి
ఏం నీళ్ళో గాని
ప్లేట్స్ లోవున్న
బుల్లిబుల్లి పూరీల లోపల
బేరగాడు నింపుతుంటే
కుర్రకారుతింటుంటే
ఆహాఁ ఏమిరుచి....
తినగా మైమరచి
ఇంట్లో కుర్రకారు పిల్లలకు అందరికీ ఇష్టమే
కొడుకులు కోడళ్ళు కూతుళ్లు అల్లుళ్ళు
మనుమలు సాయంకాలం అయితేచాలు
షికారుకి వెళ్లడం
హాయిగా పానీపూరీ తినడం

అబ్బో!
దీని సొగసు రుచి వర్ణింపతరమా!
తింటూవుంటే కుర్రకారుఆనందం
మనం చూడ తరమా!
కూడలిలో పానీపూరీ బండ్లవద్ద
రంగులలోకాన్ని వీక్షించతరమా!
దర్పణంలో చూసే ఈ పానీపూరి
ఈ సాయంత్రమే నిజంగా సేవించతరమే!



**- తాతపూడి సోమశేఖర శర్మ**

## సాయం సంధ్య

సాయం సంధ్యా సమయం
బిజీ సెంటర్
రోడ్డు పక్కన
పానీపూరీ బండి
పెద్దసంఖ్యలో అభిమానులు
అందించలేక బండి యజమానులు
పొంగిన చిట్టిపూరీ
మధ్యలో వేలితో చేసిన చిల్లి
ఉడికించిన ఆలూ బఠానీ
ఉప్పు కారం ఉల్లి
చాట్ మసాలా జీరాపొడి
కలిపిన మసాలా
కొత్తిమీర పుదీనా చింతపండు రసాలు
ఉప్పు కారం కలిపిన ద్రావణం
ఆహా ఏమి రుచి..

అనకుండా ఉంటారా!?
తినకుండా ప్రశాంతంగా ఊరకుంటారా!!??
చల్లని సాయంత్రం
టీ కాఫీ దుకాణాలకంటే
పానీపూరీ బండి
జనాల క్యూ కేంద్రం
పానీపూరీ తింటూ
స్నేహితుల ముచ్చట్ల విడిది
ఎంత తిన్నామో
తెలియని అయోమయ స్థితి
కొంచెం కొంచెంగా కొరుక్కు తినలేం
అలా చేశామో
బట్టలపై రకరకాల డిజైన్లు.



**-నాగిరెడ్డి అరుణజ్యోతి**

## జన ప్రియాహారం

పానీ పూరీ, పానీ పూరీ, పానీ పూరీ
లొట్టలేస్తారా పేరు వింటేనే లాలాజలం ఊరి
పండిత పామరులు తింటారు ఏరి కోరి
ఎంత తిన్నా తనివి తీరనిదది మరి.
పుల్లని చల్లని స్వల్ప అమ్ల ఉదకం
బూరెలా ఉబ్బిన డొల్ల పిండి గోళం
గోల్ గొప్పా నామధేయం
మధ్యన రంధ్రం
వేయి బఠాణి కూర కొంచెం
నింపితే దాని నిండా అమ్ల ఉదకం
అది చేరితే నోటి కుహరం
అందరు ఎగబడి తినే ఉపాహారమండి
ప్రతి వీధికి నేడున్న పానీ పూరీ బండి

ప్రత్యక్ష సాక్ష్యం కాదంటారా దానికి చెప్పండి
ధర చూస్తే అత్యంత సరసం
రుచి చూస్తే మళ్ళీ మళ్ళీ తినడం ఖాయం
పిల్లలకు పానీ పూరి ప్రాణం
తింటారు అదేపనిగా వదిలేసి అన్నం
పానీ పూరి బళ్లన్నీ కాదు ఆరోగ్యదాయకం
శుచి శుభ్రత ఉన్న బండే ఆమోదయోగ్యం
ఎంపిక లోనే వున్నది జన విచక్షణం
విజ్ఞతే చూపిస్తే ఆరోగ్యం, ఆనందం
విజ్ఞత లోపిస్తే చెల్లించాలి మూల్యం.



**- జె.వి.కుమార్ చేపూరి**

## చిట్టి పూరీ

సాయం సంధ్య వేళ మార్కెట్
బిజీ లో అతి బిజీ గా ఉండే
ఆహార బండి ఈ పూరీ బండి
దీనికి ఎందరో అభిమానులు.
జిహ్వ కు ఎన్నో రుచులు
పుదీనా నీటితో నింపిన
ఎంతో రుచికమైన చిట్టి పూరీ
ఇష్టం కానిదెవరికి?.
పళ్ళాలు పళ్ళాలు లాగించే
రుచి అందరు నోరు ఊరిస్తూ
చక్కని చల్లని సాయం వేళ
అందరూ కలిసి బళ్ల దగ్గర
అతి తక్కువ ధరకి తినవచ్చు
కొన్ని ప్రాంతాల్లో
పెళ్ళిళ్లలో కూడా

రిసెప్షన్ ముందురక రకాల చాట్ ఐటమ్స్
ఇదీ ఒకటి
చిట్టి చిట్టి పూరీలు
ఆకు పచ్చ పుదీనా రసం
పళ్ళెంలో అందంగా స్వాగతం
కాదేది అనర్హం
రాయడానికి కవిత
తినడానికి పానీ పూరీ
దర్పణం కవితా పార్టీ లో
మహా రుచి
ఈ రెండింటి అద్భుత రుచి.



**-నారుమంచి వాణి ప్రభాకరి**



బుధవారం సుద్దంశెట్టి అపార్ట్‌మెంట్ సమీపంలోని గాంధీనగర్ సబ్‌స్టేషన్‌లో పట్టణ ప్రగతి కార్యక్రమంలో ప్యాచ్ వర్క్‌ను పూర్తి చేస్తున్న దృశ్యం. కార్యక్రమంలో టీఆర్ఎస్ పార్టీ గాంధీనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ శ్రీమతి ముఠా పద్మ నరేష్,& సీనియర్ నాయకుడు ముఠా నరేష్, గాంధీనగర్ డివిజన్ అధ్యక్షుడు రాకేష్, ఉపాధ్యక్షుడు ఎస్.టి. ప్రేమ్, గదమేధ శ్రీను, మరియు టీఆర్ఎస్ పార్టీ జిహెచ్ఎంసి మహేష్ పాల్గొన్నారు.

# పోలీస్ అతిథి గృహాన్ని ప్రారంభించిన పోలీస్ కమిషనర్




ఖమ్మం, జూన్ 15: (నేటి నిజం ప్రతినిధి) :నగరంలోని సారధినగర్ లో గల ఓల్డ్ పోలీస్ కమిషనర్ క్యాంపు కార్యాలయాన్ని అన్ని హంగులతో పునరుద్ధరించి జిల్లా పోలీస్ అతిధి గృహం గా నిర్మించబడిన పోలీస్ గెస్ట్ హౌస్ ను ఈరోజు పోలీస్ కమిషనర్ విష్ణు యస్. వారియర్ చేతుల మీదుగా ఈరోజు ప్రారంభించారు.

జిల్లా పోలీస్ సంక్షేమ కార్యక్రమాలలో భాగంగా జిల్లా పోలీసులకు అందుబాటులో వుండేవిధంగా పోలీస్ అతిధి గృహాన్ని తీర్చిదిద్దారు. పోలీస్ గెస్ట్ హౌస్ ను ప్రారంభించిన పోలీస్ కమిషనర్ ఆనంతరం స్పెషల్ బ్రాంచ్ కాన్ఫరెన్స్ హాల్ పునరుద్ధరణ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ ఆడ్మిన్ శబరిష్, అడిషనల్ డీసీపీ లాడఆర్డర్ సుభాష్ చంద్ర బోస్, ఏఆర్ అడిషనల్ డీసీపీ కుమారస్వామి, ఏసీపీలు అంజనేయులు, రామోజీ రమేష్, ప్రసన్న కుమార్, సిఐలు సర్వయ్య, చిట్టిబాబు, శ్రీధర్, రామకృష్ణ, అంజలి, ఆశోక్, ఆర్ఐ లు రవి, తిరుపతి,శ్రీశైలం, పాల్గొన్నారు.

# భువనచంద్రకు సినారె పురస్కారం



వంశీ ఆర్ట్ థియేటర్స్, సాంస్కృతిక సంస్థల ఆధ్వర్యంలో సోమవారం చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో సినారె వంశీ శుభోదయం జీవన సాఫల్య జాతీయ సాహితీ పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ సురభి వాణీదేవి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రముఖ సినీ గేయ రచయిత భువనచంద్రకు సినారె జీవన సాఫల్య సాహితీ పురస్కారాన్ని అందజేశారు. అంతకుముందు లలితా శివజ్యోతి ఫిలిమ్స్ రహస్యం చలన చిత్ర సంగీత విశ్లేషణ గ్రంథాన్ని ఆవిష్కరించారు.

సినారె గీత రాగిణి సీడీని కవి సుద్దాల అశోక్ తేజ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో శుభోదయం గ్రూప్ చైర్మన్ లక్ష్మీప్రసాద్ కలపటపు, రహస్యం గ్రంథ రచయిత ఎస్‌వీ. రమణమూర్తి, డాక్టర్ కేవీ. రావు, సాహితీవేత్త ఓలేటి పార్వతీశం, వంశీ సంస్థల వ్యవస్థాపకుడు వంశీ రామరాజు, అధ్యక్షురాలు తెన్నేటి సుధాదేవి, మేనేజింగ్ ట్రస్టీ శైలజ, కన్వీనర్ ప్రసన్నలక్ష్మి, రాధిక తదితరులు పాల్గొన్నారు.



తెరవే కామారెడ్డి జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆదివారం సాహితీ శిఖరం సినారె వర్ధంతి సందర్భం గా కార్యకమాన్ని నిర్వహించారు. ఈ సందర్భం గా తెరవే కామారెడ్డి జిల్లా అధ్యక్షులు గఫూర్ శిక్షక్ మాట్లాడుతూ కవితా నేత్రాలతో సమాజాన్ని అధ్యయనం చేసి అక్షరాల గవాక్షం లోంచి విశ్వదర్శనం గావించిన సాహితీ దార్శనికుడు సినారె జీవితం అందరికి ఆదర్శప్రాయమన్నారు

ఈ కార్యక్రమంలో సినారె చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు అల్లి మోహన్రాజ్ గంగాప్రసాద్ పీతాంబర్ రాంచంద్రం చంద్రకాంత్ తిరుపతి రావు బాణీత్ సురేష్ తదితరులు పాల్గొన్నారు .

# సోమనాథ కళా పీఠం పురస్కారాలు జూన్ 26 న పాలకుర్తిలో ప్రదానోత్సవం

మహాకవి పాలకురికి సోమనాథుని జన్మస్థలమైన తెలంగాణ రాష్ట్రం జనగామ జిల్లా పాలకుర్తిలోని 'సోమనాథ కళా పీఠం' వారి 2020 పురస్కారాల ఎంపిక పూర్తి అయింది.

**మఠం లింగయ్య స్వామి** (హైదరాబాద్) – సోమనాథ సాహిత్య పురస్కారం, **దండి వెంకట్** (నిజామాబాద్) – సోమనాథ సామాజిక శోధన పురస్కారం, **తడకమళ్ళ రాంచందర్ రావు** (మిర్యాలగూడ) – సోమనాథ రంగస్థల పురస్కారం, **సత్తి సునీల్ రెడ్డి** (విశాఖపట్నం) – పందిళ్ల శేఖర్ బాబు రాజయ్య శాస్త్రి స్వచ్ఛంద భాషా సేవ పురస్కారం, **చింతకాయల అంజనేయులు** (ఖమ్మం) – వీరమనేని చలపతి రావు సాహిత్య పురస్కారం, **వేదవీర్ ఆర్య** (కొత్త దిల్లి) – ముశం దామోదర్ రావు ప్రాచీన చరిత్ర వైజ్ఞానిక పరిశోధన పురస్కారం **చిలుకమారి రాజేశ్** (పాలకుర్తి) – డాక్టర్ రాపోలు సోమయ్య ప్రతిభా పురస్కారం లకు **వేముల శ్రీ** (సిద్దిపేట) – దేవగిరి రాజయ్య స్మారక "సరస్వతీ సంసేవక" బిరుదుకు ఎంపిక అయినారు.

రాపోలు ఆనందభాస్కర్, లింగంపల్లి రామచంద్ర, టి శ్రీరంగస్వామి, మార్గం లక్ష్మినారాయణ (సమన్వయ కర్త) లతో కూడిన నిర్ణాయక మండలి ఈ ఎంపిక చేసింది.

పురస్కార ప్రదానం 2022 జూన్ 26 ఆదివారం నాడు పాలకుర్తిలో జరుగ గలదు.

రాపోలు సత్యనారాయణ – అధ్యక్షుడు ఇమ్మడి దామోదర్ – కార్యదర్శి

# అంతర్ రాష్ట్ర సరిహద్దుల జిల్లా పోలీసులు సత్సంబంధాలు కలిగి నేరాల అదుపునకు కృషిచేయాలి- సంగారెడ్డి జీల్లా ఎస్పీ రమణ కుమార్.




సంగారెడ్డి జున్ 15 (నేటి నిజం ప్రతినిధి) అంతర్ రాష్ట్ర క్రైమ్ రివ్యూ మీటింగ్ లో భాగంగా మంగళవారము నాడు కర్ణాటక లోని బీదర్ జిల్లా ఎస్పీ కార్యాలయంలో మూడు ( కర్ణాటక, మహారాష్ట్ర, తెలంగాణ) రాష్ట్రాలకు చెందిన బార్డర్ జిల్లా ఎస్పీలు రివ్యూ మీటింగ్ నిర్వహించారు.. సరిహద్దులు జిల్లా పోలీసులు సత్సంబంధాలు కలిగి ఉండి నేరాల అదుపునకు కృషిచేయాలని సంగారెడ్డి జిల్లా ఎస్పీ రమణ కుమార్ అన్నారు. డిఎస్పీ లు, సి.ఐ లు, ఎస్సై లు బార్డర్ పోలీస్ స్టేషన్ లతో సత్సంబంధాలు కలిగి పరస్పరం సమాచారం అందించుకోవలని ఆయన అన్నారు.

మిస్సింగ్ కేసుల, గుర్తు తెలియని మృతదేహాల సమాచారం అనగా లుక్ ఔట్ నోటీస్ లను బార్డర్ పోలీస్ స్టేషన్ లకు ఇవ్వడం వలన మిస్సింగ్ కేసుల చేదన సులభతరం అవుతుందన్నారు. అంతర్ రాష్ట్ర దొంగల ముఠాల సమాచారం పరస్పర బదిలీ చేయడం ద్వారా కేసులను త్వరితగతిన చేదించగలమన్నారు. వీ.ఐ.పీ లకు ఎస్కార్ట్, పైలేటింగ్ విషయమై సమాచారం బార్డర్ పోలీస్ స్టేషన్ లకు అందించుకొని పరస్పరం సహకారం చేసుకోవాలని ఆయన కోరార. మన రాష్ట్రంలో నిషేదించబడిన గుట్కా, గంజాయి ఇతర పొరుగు రాష్ట్రాల నుంచి ట్రాన్స్-పోర్ట్ అవుతున్న సమాచారం బార్డర్ పోలీస్ స్టేషన్ లకు ఇవ్వడం ద్వారా అట్టి కేసులను అరికట్టదానికి సులభముతుందన్నరు. ఇక్కడ నేరం చేసి, ఇతర రాష్ట్రాలలో తల దాచుకున్న నేరస్తుల విషయమై పరస్పరం సహకారం చేసుకోవాలని ఆయన కోరారు.

ఈ కార్యక్రమంలో బీదర్ జిల్లా ఎస్పీ కిషోర్ బాబు, కామారెడ్డి జిల్లా ఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, డిఎస్పీ.లు కలగుర్గి, లాతూర్, నాందేడ్, నారాయణఖేడ్ డిఎస్పీ రామ్, జహీరాబాద్ డిఎస్పీ రఘు, జహీరాబాద్ సి.ఐ భూపతి, నారాయణఖేడ్ సి.ఐ రామకృష్ణ రెడ్డి, యస్.బి. ఇన్-స్పెక్టర్ మహేష్ గౌడ్, డి.సి.ఆర్.బి. ఇన్-స్పెక్టర్ జెలెందర్ రెడ్డి మరియు మూడు రాష్ట్రాలకు చెందిన బార్డర్ పోలీస్ స్టేషన్ యస్. ఐ. లు తదితరులు పాల్గొన్నారు.

# బండపల్లిలో వాటర్ ప్లాంట్ స్థాపనకు ప్రతిమ ఫౌండేషన్ చేయూత

## --రూ.2.10 లక్షల చెక్కు అందజేసిన ఫౌండేషన్ అధినేత వికాస్ రావు



రాజన్న సిరిసిల్ల, జూన్ 15: (నేటినిజం ప్రతినిధి):చందుర్తి మండలం బండపల్లి గ్రామంలో ఉచిత మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు రూ.2.10 లక్షల చెక్కును ఫౌండేషన్ అధినేత డాక్టర్ చెన్నమనేని వికాస్ రావుమంగళవారం ప్రతిమ ఫౌండేషన్ కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా బండపల్లి సర్పంచ్ అభ్యర్థనకు స్పందించి మినరల్ వాటర్ ప్లాంట్ కు ఆర్థిక సహాయం చేయడానికి వికాస్ రావు ముందుకువచ్చారు. ఈ సందర్భంగా డాక్టర్ వికాస్ మాట్లాడుతూ విద్య, వైద్యం శుద్ధ జల కేంద్రాలు, ఇలాంటి ఎన్నో కార్యక్రమాలు ప్రతిమ ఫౌండేషన్ ద్వారా పేద, మధ్యతరగతి వారికి ప్రతిమ ఫౌండేషన్ ద్వారా ఆర్థిక చేయూత నిచ్చి ఆదుకోవడం జరుగుతుందని తెలిపారు. ముఖ్యంగా ఆరోగ్యమే మహాభాగ్యము అనే నినాదంతో ఎంతోమందికి ఉచిత వైద్య సేవలు అందిస్తూ వారి ఆరోగ్యాలు బాగుపడటానికి కృషి చేస్తున్నామని వెల్లడించారు. ఎవరికైనా ఇబ్బందులు ఉంటే ప్రతిమ ఫౌండేషన్ ను సంప్రదించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ న్యాత విజయ- జార్జ్, ఎంపీటీసీ, రణధి?ర్ రెడ్డి మరియు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.




## కణిక



అడ్మిన్: **రమాదేవి కులకర్ణి**

సాహిత్యం, సామాజిక సేవ, విద్యారంగ వేదిక నిర్వహిస్తున్న

# 'బుధవారం బాద్షా' పోటీ ఫలితాలు



నిర్వహణ: **శ్రీమతి సత్య నీలిమ వలిపే**
ఈ సమూహంలో చేరదలచినవారు 8985613123కి మెసేజ్ చేయవచ్చు.

(ప్రథమ)

## చదవ గలవా

కనురెప్పల క్రింద కదలాడుతూ
నను కలవర పెడుతున్న కలలెన్నో
రెప్పల తలుపులు మూసుకున్నా
చప్పుడు చేయకుండా అల్లరి చేస్తున్నాయి
ప్రతి కలా నీ రూపునే చూపుతున్నాయి
నీ ధ్యాసనే శ్వాసిస్తున్నాయి.
చప్పుడు చేయని కనురెప్పల
మౌన భాష నీకు చెప్పాలని
కనులు విప్పాలని
నిద్రాదేవిని బతిమాలబోతే.
కలలు కసురు తున్నాయి
విసుగుతో మూతి ముడిచాయి
గుట్టు దాచాలని అరచేతులు
అడ్డుకుంటున్నాయి .
రెప్పలు దాచిన కనులు
చప్పుడు చేయని కలల ఊసు
చెప్పగలవా
కను రెప్పల భాష చదవగలవా
హృదయ లోతుల ప్రేమను
కొలవగలవా
మనసులో మౌనాన్ని గెలవగలవా.



**-కొలచన విజయ భారతి**
9703130342

(ద్వితీయ)

## కనురెప్పల భాష

మూస్తూ,తెరుస్తూ లయగా సాగే
చప్పుడు చేయని కనురెప్పల సరిగమలు...
అలసటతో వాలిన వేళ
గడియైనా వదలని నీ తలపులు
మళ్లీ మళ్ళీ వింటూండాలనిపించే
నీ పిలుపులు!.
ప్రాయం చేసే మాయాజాలంతో...
ఊరించే ఆశల మోహంతో...
ఉరకలేసే ఆలోచనల వేగంతో...
ఉక్కిరిబిక్కిరి చేసే
అనుభూతులతో ఉవ్వెత్తున ఎగసిన
గడుసు వలపు సునామీ!.
పరువంలో పలికే పదనిసలు
పులకరింతల చమరింతల ఎదనసలు
ఎక్కడో ఎవరో ఒకరితో
ఒకరు చెప్పుకున్న గుసగుసలు!.
తొందర చేసే తొలకరి చూపులు
ఎదను గాలమేసి లాగితే...
చిక్కుకున్న చిలిపి ఊహలు
సందేహాలతో సతమతమయ్యే జవాబులు..
తార్కికతను మరచిన
తనువు తహతహలు
బిడియంతో తడబడే అడుగులు!
నీకేమి తెలియునులే
అతివ అంతరంగపు లోతులు
అలదుకునే బంధపు గంధాలు
అణగారిన చిన్నపాటి కోర్కెలు
అణచుకొన్న ఆనందపు దీప్తులు!!!



**-చంద్రకళ. దీకొండ**
ఊరు : మల్కాజిగిరి

# ముంబాయి ఆంధ్ర మహాసభ ఎన్నికల్లో తెలంగాణ వాసుల విజయం



సంకు సుధాకర్



సంగెవేని రవీంద్ర

బొంబాయి ఆంధ్ర మహాసభ అధ్యక్షుడు గా సంకు సుధాకర్ గెలుపుకోరుట్లకు చెందిన సంకు సుధాకర్ బొంబాయి ఆంధ్ర మహాసభ ఉ జింఖానకు ముచ్చటగా మూడోసారి అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు..12 జూన్ నాడు జరిగిన ఎన్నికల్లో ఆయన తన సమీప ప్రత్యర్థి సంగం ఏక్ నాథ్ ను 94 ఓట్లతో ఓడించి మరోసారి అధికారం



ఎన్నికల సందర్భంగా సభ్యులతో యెల్ది సుదర్శన్ పద్మశాలి

చేజిక్కించుకున్నాడు.. ఏక్ నాథ్ కు 434 ఓట్లు రాగా, సుధాకర్ కు 528 ఓట్లు వచ్చాయి.. సంకు సుధాకర్ కు చెందిన కోరుట్లలోని ఆయన నివాస భవనం రోజూ ముంబైవాసులతో నిండి ఉంటుంది.. వృత్తిరీత్యా ఆర్కిటెక్ట్ అయిన సుధాకర్ గతంలో శాసన సభ ఎన్నికల్లో కూడా పోటీ చేసాడు..ఆంధ్ర మహాసభకు గతంలో ఒకసారి అధ్యక్షుడుగా చేసారు. ఇప్పుడు వరుసగా రెండోసారి గెలవడంతో మూడు సార్లు అధ్యక్షుడుగా రికార్డ్ సృష్టించాడు..అధ్యక్షుడుగా సంకు సుధాకర్ తో పాటు ప్రధాన కార్యదర్శిగా వేముల మనోహర్, ఉపాధ్యక్షులుగా ఎలిగేటి రాజ్ కుమార్, సంగెవేని రవీంద్ర, రాధామోహన్, ధర్మకర్తలుగా భోగా సహదేవ్, ధ్యావరిశెట్టి గంగాధర్, గాలి మురళీధర్, కస్తూరి హరిప్రసాద్, గట్టు నర్సయ్య, కోశాధికారిగా బింగి సత్యనారాయణ, సంయుక్త కార్యదర్శులు గా జక్కని శ్రీనివాస్, తాళ్ల లక్ష్మణ్, గుజ్జేటి కృపేందర్, కార్యవర్గ సభ్యులుగా డా.అనుపమ, వాసాల గంగాధర్, అల్లె శ్రీనివాస్, కొక్కుల రమేష్, జిందం భాస్కర్, అల్లె శంకరయ్య, సాదుల రమేష్, చిల్వేరి గంగాదాస్, వీరబత్తిని సత్యనారాయణ తదితరులు ఎన్నికయ్యారు..

ఆహ్వానం

శ్రీ కిరణ్ సాంస్కృతిక సమాఖ్య
మరియు
ప్రపంచ రికార్డులలో స్థానం పొందిన ఆడిటోరియం
శ్రీ త్యాగరాయ గానసభ సంయుక్త ఆధ్వర్యంలో
శ్రీ కళాసుబ్బారావు కళావేదిక, చిక్కడపల్లి, హైదరాబాద్.
తేది :19-06-2022, ఆదివారము, సమయం : సా॥ 6.00 గంటలకు



" శ్రీమతి ఏకాపద్మ స్మారక పురస్కార ప్రధానోత్సవ సభ "

| | | |
|---|---|---|
| ముఖ్య అతిథి | : | ప్రొ॥ డా॥ డి. ఓబుల్ రెడ్డి, Ph.d<br>విశ్రాంత - ప్రొఫెసర్, ఉస్మానియా విశ్వవిద్యాలయము. |
| సభాధ్యక్షులు | : | డా॥ ప్రతాప పున్నయ్య,<br>విశ్రాంత - అడిషనల్ డైరెక్టర్, యానిమల్ హస్బెండరి. |
| విశిష్ఠ అతిథి | : | శ్రీ కళా వి.ఎస్. జనార్ధన్ మూర్తి,<br>అధ్యక్షులు - శ్రీ త్యాగరాయ గాన సభ. |
| గౌరవ అతిథి | : | శ్రీ బైస దేవదాసు, సంపాదకులు, నేటినిజం. |
| పురస్కార గ్రహీత | : | డా॥ శ్రీమతి శరణ్య, M.B.B.S., M.D.,<br>జనరల్ ఫిజీషియన్. |
| పురస్కార ప్రదాత | : | శ్రీ ఏకా నాగరాజ రామ మోహన రావు,<br>ప్రొప్రైటర్, పద్మ ఆప్టికల్స్. |
| వందన సమర్పణ | : | శ్రీమతి ఏకా వేంకట ధర్మ సంవర్ధని |

శ్రీ కళా వి.ఎస్. జనార్ధన్ మూర్తి, అధ్యక్షులు - శ్రీ త్యాగరాయ గాన సభ
శ్రీమతి కళా శారద, ప్రధాన కార్యదర్శి - శ్రీ త్యాగరాయ గాన సభ



లంకా వెంకట సుబ్రహ్మణ్యం, అధ్యక్షులు, శ్రీమతి భాను, కార్యదర్శి
శ్రీ కిరణ్ సాంస్కృతిక సమాఖ్య
ప్లాట్ నెం. 308, శ్రీ మణికంఠ అపార్టుమెంట్స్, కళ్యాణనగర్, ఈస్ట్ ఆనంద్‌బాగ్, మల్కాజ్‌గిరి, హైదరాబాద్ - 500 047. సెల్ : 94404 48650

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas. **RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com.